ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 10 మే 2024




యువత బతుకుల్లో జగన్ చీకట్లు!

వైసీపీ పాలనలో రెట్టింపైన నిరుద్యోగిత

- ఉన్న పరిశ్రమలను తరిమేసిన వైనం..
- కొత్తవాటిని అడ్డుకున్న పాలకులు
- ఉపాధి లేక యువత వలసబాట
- టీడీపీ హయాంలో కొలువుల జాతర
- మళ్లీ బాబు వస్తేనే.. ఉద్యోగాలు అన్న నమ్మకం






జగన్ ఐదేళ్ల పాలనలో తలచుకుంటే యువత గుండెలు బరువెక్కిపోతున్నాయి. కోపంతో రగలిపోతున్నారు. విలువైన కాలాన్ని కోల్పోయారు. జీవితంలో స్థిరపడలేక, తల్లిదండ్రులకు ఆసరాగా నిలబడలేక నలిగిపోయారు. వైసీపీ ప్రభుత్వ చేతగానితనానికి బలైపోయారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో నిరుద్యోగులు రెట్టింపయ్యారు. కోటి ఆశలతో చదువులు పూర్తి చేసి, విద్యాలయాల నుంచి బయటకు రావడమే తప్ప.. కొలువులు దక్కింది లేదు. సీఎం జగన్ ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ కూడా తేలేక చేతులెత్తేశాడు. ఉన్న వాటినీ వేధింపులతో తరిమేశాడు. దేశంలోని ఇతర నగరాలు, విదేశాల్లో వివిధ పరిశ్రమలు, ఐటీ ఉత్పత్తులు, ఇతర సేవల రంగాల్లో కొలువులు సాధించే దిశగా యువతకు కనీసం నైపుణ్య శిక్షణ ఇప్పించిన పాపాన పోలేదు. టీడీపీ హయాంలో నెలకొల్పిన వాటినీ సరిగా నిర్వహించలేక జగన్ చేతగానితనాన్ని బయటపెట్టుకున్నారు. జగన్ నిర్వాకం కారణంగా రాష్ట్రంలో ఉద్యోగాలు కరువయ్యాయి. లక్షలాది యువత భవిష్యత్తు అంధకారంలో పడింది. - ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

టీడీపీ హయాంలో నైపుణ్యాభివృద్ధి ఓ ఉద్యమంలా సాగింది. రాష్ట్రంలో ప్రతిభ ఉన్న యువతను నైపుణ్యాలపరంగా సానపడితే ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు దక్కించుకుంటారని అప్పటి సీఎం చంద్రబాబు అన్న మాటలు అక్షర సత్యాలు. పరిశ్రమల అవసరాలను విశ్లేషించి, ఇక్కడి యువతకు ఎలాంటి నైపుణ్య శిక్షణ ఇవ్వాలోనని ఆలోచించారు. వీరిలో ఎలాంటి నైపుణ్యాలున్నాయో గుర్తించి, ఏం మెరుగుపరచాలో గుర్తించారు. ఆ దిశగా నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఫలితంగా 2014-19 మధ్య కాలంలో వేలాది మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, మంచి కొలువులు సాధించేలా చేయగలిగారు. ఈ శిక్షణ ఓ ఉద్యమంలా సాగింది. విద్యార్థులు చదువుకునే సమయంలోనే పీజీ, డిగ్రీ,

ఓ ఉద్యమంలా..



ఇంజనీరింగ్ వృత్తి విద్యాకళాశాలకు వెళ్లి నైపుణ్య శిక్షణ అందించారు. వివిధ పరిశ్రమల్లో అవసరాలకు ఎలాంటి నైపుణ్యం కావాలో అందుకు తగ్గట్టుగా సానబట్టారు. చదువు పూర్తయిన వెంటనే విద్యార్థులు సదరు సంస్థలు, పరిశ్రమల్లో చేరారు. యువనేస్తం ద్వారా నిరుద్యోగులకు భృతి ఇవ్వడంతోపాటు వారికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. సీఎం యువనేస్తం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి దగ్గర్లోనే ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ తదితర కోర్సుల వారికీ అందించారు. ప్రతి కేంద్రంలో 120 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చారు. కమ్యూనికేషన్ స్కిల్, ఆకట్టుకునే రెజ్యూమ్ తయారీ మొదలుకుని ఉద్యోగాలకు అవసరమైన అన్ని నైపుణ్యాలను నేర్పించారు. కోర్సులు పూర్తికాగానే ఉద్యోగం దక్కేలా చేశారు.

ఐదేళ్ల జగన్ సర్కారు హయాంలో ఉద్యోగ మేళాలు లేవు, కొలువులూ లేవు. ఏటా వివిధ కోర్సుల్లో పూర్తి చేసి సగటున 20 వేల మంది దాకా కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. వీరందరికీ ఉద్యోగావకాశాలు




వైసీపీ పాలనలో రెట్టింపు

లేక పక్క రాష్ట్రాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఉద్యోగాల కోసం వెతికేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. పొరుగు రాష్ట్రంలో వేతనాలు తగ్గించి, ఇంతే ఇస్తామనీ, చేస్తే చేయండి.. లేదంటే వదలేయండి అన్న బెదిరింపుల నడుమ బిక్కుబిక్కుమంటూ పని చేయాల్సి వస్తోంది. టీడీపీ హయంలో 13 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఉండగా వైసీపీ అధికారం చేపట్టాక రెండేళ్ల కిందట కొత్తగా ఆరు స్కిల్ హబ్ సెంటర్లు, ఒక నైపుణ్యాభివృద్ధి కళాశాల ఏర్పాటు చేశారు. స్కిల్ హబ్, కళాశాలలో శిక్షణ పొందిన వారు జిల్లా వ్యాప్తంగా 840 మంది ఉండగా.. 300 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో మమ అనిపించారే తప్ప.. ఎంతమందికి కొలువులు వచ్చాయో కచ్చితంగా చెప్పలేని దుస్థితి నెలకొంది.

ఒక్క పరిశ్రమ కూడా రాలే..

వైసీపీ పాలనలో ప్రకటలే తప్ప.. జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటైంది లేదు. కొత్తగా ఉద్యోగం వచ్చింది లేదు. జిల్లాలో ఎక్కడ కొత్త పరిశ్రమ ఏర్పాటు చేశారో చెప్పుకోలేని దుస్థితిలో పాలకులు ఉన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 పేరుతో విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడుల ఆకర్షణీయ సదస్సులో రూ.13 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని సీఎం జగన్ గొప్పలు చెప్పారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి, యువతకు ఉపాధి కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. జిల్లాకు పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వస్తాయనీ, ఆ మేరకు వివిధ సంస్థలు ఒప్పందాలతో కుదిరాయని ప్రకటించారు. గతేదాది జిల్లాలో పలు పరిశ్రమలకు శంకుస్థాపన చేసి, ఊదరగొడితే జనం నమ్మారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చేపట్టిన పని నెరవేతుందనుకున్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, వేలాది మందికి ఉపాధి కల్పిస్తామంటూ శిలాఫలకాలు వేసి, హామీల గారడీ చేశారు. శంకుస్థాపనల హామీతో సరి.. ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేసింది లేదు. ఆ దిశగా అడుగుముందుకుపడింది లేదు. స్వయానా సీఎం శంకుస్థాపన చేసిన పరిశ్రమలకే దిక్కులేకుండాపోయింది. మళ్లీ ఓటు కాలం వచ్చేసింది. టీడీపీ హయంలో కియతోపాటు అనుబంధ సంస్థలు, నాసిన్, బెల్ ఏర్పాటుతో గార్మెంట్స్ పరిశ్రమల రాకతో రైతు కుటుంబాలతోపాటు లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ఆశలు రేకెత్తించింది. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచి మళ్లీ ఎన్నికలు వచ్చినా ఒక్క పరిశ్రమ తీసుకురాలేక పోగా.. ప్రకటనలతో గారడీ చేశారు. కొత్త పరిశ్రమలు తీసుకురావడంపై చొరవ చూపకపోవడంతో లక్షలాది మంది నిరుద్యోగ యువత రోడ్డున పడ్డారు. టీడీపీ హయాంలో పరిశ్రమల స్థాపనతో ఉపాధి కోసం జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి రాగా.. వైసీపీ పాలనలో యువశక్తి నిర్వీర్యమైపోయింది. ఉద్యోగాలు లేక పొరుగు రాష్ట్రానికి వలస వెళ్లాల్సిన దుస్థితి కల్పించారు. వారి బతుకుల్లో చీకట్లు నింపారు.



ప్రగతిబాట పట్టిస్తా

ఆంక్షలు లేని సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

కూటమి హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ

సూపర్-6తో సమగ్ర ప్రగతి



బీకే పార్థసారథి

పుట్టపర్తి, మే9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి నిలిచిపోయి, నిరుద్యోగం పెరిగిపోయిందనీ, యువతకు ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వలస వెళ్లే దుస్థితి ఏర్పడిందని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవి కూడా వెళ్లిపోయాయని వాపోయారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిరక్ష్యంతో ఎక్కడికక్కడే ఆగిపోయాయన్నారు. వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతులు, కూలీలు వలసలు కట్టే దుస్థితి ఏర్పడిందన్నారు. కూటమి అధికారం చేపట్టగానే విజనరీ నేత, పరిపాలనాదక్షుడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే మొదటి సంతకం మెగా డీఎస్సీపైనే ఉంటుందనీ, ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చి, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని ఉద్ఘాటించారు. కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాన్ని ప్రగతి బాట పట్టిస్తానని 'ఆంధ్రజ్యోతి'కి గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

ప్ర: జిల్లా వెనుకబడిన ప్రాంతం. నీరెలా ఇస్తారు, పరిశ్రమల ఏర్పాటుకు ఎలా కృషి చేస్తారు?

జ: ఒకప్పుడు ఉమ్మడి అనంత జిల్లా అంటే అతి తక్కువ వర్షపాతం, కరువు అని చెప్పుకునే పరిస్థితి. ఇలాంటి జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సంకల్పించారు. జిల్లా ప్రజల జీవన విధానంలో మార్పు తెచ్చారు. ఎన్టీఆర్ మానసపుత్రిక హంద్రీనీవా పథకం ద్వారా జిల్లాలో వందలాది చెరువులను కృష్ణాజలాలతో నింపడానికి చంద్రబాబు రాత్రింబవళ్లు కాలువ గట్లపై నిద్రించారు. ఉమ్మడి జిల్లాలోని చెరువులన్నింటినీ నింపి, రైతుల కళ్లలో ఆనందం నింపారు. పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఇతర రాష్ట్రాలతో పోటీపడి అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమను తీసుకొచ్చి, జిల్లాకు వరంగా ఇచ్చారు. టీడీపీ హయాంలోనే గొల్లపల్లి రిజర్వాయర్‌ను కట్టించి, అంతర్జాతీయ కియ పరిశ్రమతోపాటు అనుబంధ సంస్థలు తెచ్చాం. వేలాది మందికి ఉపాధి కల్పించాం. ప్రజల ఆర్థికాభివృద్ధిలో చాలా మార్పులు తెచ్చాం. వలస వెళ్లిన రైతులను సొంతూళ్లకు రప్పించాం. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను గతంలోనే సేకరించాం. ఐదేళ్లలో వైసీపీ ఒక్క పరిశ్రమ తీసుకురాకపోగా.. ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదు. జగన్‌పై నమ్మకంలేక ఏర్పాటు కావాల్సిన పరిశ్రమలు కూడా వెనుదిరిగాయి. కూటమి అధికారంలోకి రాగానే పరిశ్రమలు తీసుకొస్తాం. ఇతర ప్రాంతాల వారు ఇక్కడికి ఉపాధి కోసం వచ్చేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తాం.

ప్ర: నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ఏమైనా ఉందా?

జ: లేపాక్షి నాలెడ్జ్ హబ్ 8840 ఎకరాలు, మడకశిర ప్రాంతంలో 1600 ఎకరాలు, హిందూపురం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన 60 వేల ఎకరాల భూములున్నాయి. పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. యువతకు ఉద్యోగాలు కల్పించి, రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుని అభివృద్ధి పథంలో నడిపిస్తా. రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, మడకశిర, పుట్టపర్తి చిక్‌బళ్లాపురం రైల్వేలైన్ నిర్మాణానికి కృషిచేస్తా. సూపర్-6 పథకాలతో ఆంక్షలు లేని సంక్షేమం అన్నివర్గాల జీవన ప్రమాణం మెరుగుదలకు ప్రణాళికతో ముందుకెళ్తాం. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాన్ని ప్రగతి బాట పట్టిస్తాం. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు ఇస్తాం. మడకశిర నియోజకవర్గానికి సాగునీరు అందించడం నా చిరకాల స్వప్నం. జిల్లాను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్ది, దేశవిదేశాలకు పంట ఉత్పత్తులను ఎగుమతి చేయించి, రైతును రారాజు చేస్తాం.

ప్ర: వైసీపీ ఐదేళ్ల పాలన ఎలా ఉంది?

జ: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం. కక్షలు, కార్పణ్యాలతో ప్రజలను హింసించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టలేదు. జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. ఒక్క పరిశ్రమ తెచ్చింది లేదు. ప్రభుత్వానికి ముందుచూపు లేక రిజర్వాయర్లు, చెరువులను కృష్ణాజలాలతో నింపకుండా ఎండబెట్టారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర కాలువ వెడల్పు చేస్తామని హామీ ఇచ్చి, మరిచారు. వైసీపీ పాలనలో అభివృద్ధి జాడేలేదు. అభివృద్ధిని గాడేలో పెట్టడమే మాముందున్న లక్ష్యం.

ప్ర: నియోజకవర్గ పరిధిలో ప్రజలపై మీ నమ్మకం ఏంటి?

జ: ప్రతి నియోజకవర్గంలో టీడీపీని గెలిపించాలని ప్రజలు దృఢనిశ్చయంతో ఉన్నారు. కూటమి గెలుపు ఖాయమైంది. పరిపాలనాదక్షత కలిగిన చంద్రబాబును సీఎం చేయడానికి ప్రజలు కంకణబద్ధులై తండోపతండాలుగా వస్తున్నారు. మరికొన్ని రోజుల్లో జగన్ రాక్షస పాలన అంతం కాబోతోంది. ఆర్థికంగా, అభివృద్ధిపరంగా గాడితప్పిన ఈ రాష్ట్రాన్ని మోదీ నిబద్ధత, చంద్రబాబు సమర్థత, పవన్ కల్యాణ్ చొరవతో పునఃనిర్మిస్తారని ప్రజలు నమ్ముతున్నారు. నా 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో జడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేశా. సేవాకార్యక్రమాలు చేపట్టా. పార్టీలకతీతంగా ప్రజల నుంచి స్పందన వస్తోంది. ముక్కూమొహం తెలియని కర్ణాటక నుంచి వచ్చిన వైసీపీ ఎంపీ అభ్యర్థిని ఎవరూ ఆదరించరు. నేను నిత్యం అందరికీ అందుబాటులో ఉంటా. అందుకే ప్రజలు నీరాజనాలు పలుకుతూ బ్రహ్మరథం పడుతున్నారు. వైసీపీ పాలనకు చరమగీతం పాడి, టీడీపీకి పట్టం కట్టబోతున్నారు.



విద్యుత్ స్తంభంపైనే రైతు శ్రీనివాస్ మృతదేహం, రైతు ఫైల్ ఫోటో

కాటేసిన నిర్లక్ష్యం..!

విద్యుదాఘాతంతో రైతు మృతి

స్తంభంపైనే దుర్మరణం

ట్రాన్స్‌కో ఉద్యోగుల నిర్లక్ష్యంతోనే..



విషాదంలో రైతు కుటుంబం

అగళి, మే 9: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం అన్నదాతను కాటేసింది. కరెంటు స్తంభానికే మృతదేహం వేలాడింది. విద్యుత్ స్తంభం ఎక్కించి, పనులు చేస్తున్నపుడు ఉన్నఫలంగా విద్యుత్ సరఫరా ఇవ్వడంతో మండలంలోని కంబదపల్లికి చెందిన రైతు శ్రీనివాస్(45) గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్ఐ వీరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస్ వ్యవసాయం చేసుకుంటూ లైన్‌మన్ మంజునాథ్ వద్ద ఐదేళ్లుగా సహాయకుడిగా పనికెళ్తుండేవాడు. మండలంలోని ఆలూడి గ్రామానికి చెందిన రైతు ఉగ్రప్ప పొలంలోని విద్యుత్ స్తంభంలో ఫీజు పోయింది. ఫీజు వేయాలంటూ శ్రీనివాస్‌కు గురువారం లైన్‌మన్ మంజునాథ్ తెలిపాడు. ఉదయం ఎల్‌సీ తీసుకుని, శ్రీనివాస్‌ను స్తంభం ఎక్కించారు. ఫీజు వేస్తుండగా ఉన్నఫలంగా విద్యుత్ సరఫరా కావడంతో శ్రీనివాస్ స్తంభంపైనే దుర్మరణం చెందాడు. మృతదేహం స్తంభంపైనే ఉండిపోయింది. సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ వీరేష్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

మడకశిర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టడమే లక్ష్యం

రిజర్వాయర్ల నిర్మాణం చేపడతా

పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తా



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిరుద్యోగ సమస్యను రూపుమాపి, వలసలను అరికడతా

టీడీపీ కూటమి మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

మడకశిర/టౌన్, మే 9: మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి ఎన్డీఏ మేనిఫెస్టోతోపాటు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి శాసనసభ అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గంలో శాశ్వతంగా నిలిచిపోయే అభివృద్ధి పనులు చేపట్టడమే తన లక్ష్యమని ఉద్ఘాటించారు. అధినేత చంద్రబాబుతోపాటు రాష్ట్ర మంత్రివర్గంలోని ప్రతి ఒక్కరితో సంప్రదించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమనీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య తన దృష్టికి వచ్చిందనీ, రాళ్లపల్లి వద్ద, రత్నగిరి కొల్లాపురమ్మ రిజర్వాయర్లు ఏర్పాటు చేసి, శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ప్రచారం, నియోజకవర్గ అభివృద్ధికి తాను తీసుకునే చర్యలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి గురువారం ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలివీ..

ఆంధ్రజ్యోతి: ప్రచారంలో స్పందన ఎలా ఉంది?

ఎంఎస్ రాజు: నియోజకవర్గంలో ప్రచారానికి ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు హారతులతో ఆశీర్వచనాలు పలుకుతున్నారు. యువత కేరింతలతో స్వాగతం పలుకుతున్నారు. జగన్ పరిపాలనలో గ్రామాల అభివృద్ధి అటకెక్కింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యం.

ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యేగా గెలుపొందితే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు?

ఎంఎస్ రాజు: నియోజకవర్గంలో ప్రధానంగా తాగు, సాగునీటి సమస్య అధికంగా ఉంది. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలను తీసుకొచ్చి, నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపి, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా. పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగావకాశాలు కల్పించి, ఈ ప్రాంతం నుంచి వలసలు అరికడతాం. సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటాం.

ఆంధ్రజ్యోతి: తాగు, సాగునీటి సమస్యను ఎలా పరిష్కరిస్తారు?

ఎంఎస్ రాజు: మడకశిర నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించాం. తెలుగుదేశం, జనసేన, బీజేపీ మేనిఫెస్టోతోపాటు ప్రత్యేక ప్రణాళిక ద్వారా నియోజకవర్గంలో అభివృద్ధి, తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటా. బైపాస్ కెనాల్ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిరకు సాగునీరు తీసుకొస్తాం.

ఆంధ్రజ్యోతి: నాన్‌లోకల్ విమర్శలను ఎలా తిప్పికొడతారు?

ఎంఎస్ రాజు: నేను ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వాడిని. అధికార పార్టీ తనను నాన్‌లోకల్ అంటూ ఎన్నికల్లో లబ్ధి పొందే కుట్ర పన్నుతోంది. వైసీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థిగా పోటీచేసే శాంతమ్మది ఏరాష్ట్రం, ఎంపీ గోరంట్ల మాధవ్‌ది ఏ జిల్లా, కళ్యాణదుర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్యది ఏ జిల్లా ఇలా అనేకమంది పక్క జిల్లాలు, రాష్ట్రాల నుంచి పోటీ చేస్తున్నారు. నాది ఉమ్మడి అనంత జిల్లానే. ఈప్రాంతంపై అవగాహన ఉన్నవాడిని. రైతు బిడ్డను. ఇలా ఓట్ల కోసం నాన్‌లోకల్ అనడం ఎంతవరకు న్యాయమో వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఎంఎస్ రాజు: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే డబ్బు డిమాండ్ చేయడంతో పరిశ్రమలు ప్రారంభించేందుకు నిర్వాహకులు వెనక్కు వెళ్లారు. తిరిగి వారిని రప్పించి, పరిశ్రమలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుని, ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. లెదర్ ఫ్యాక్టరీని ప్రారంభించడంతోపాటు అర్ అనంతపురం వద్ద పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తా.

ఆంధ్రజ్యోతి: ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి పరిస్థితి ఎలా ఉంది?

ఎంఎస్ రాజు: వెనకబడిన మడకశిర నియోజకవర్గంలో బలమైన నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజాసమస్యలపై పోరాటాలు చేయడంతోనే నాపై 55 తప్పుడు కేసులు పెట్టింది. అధికార పార్టీ అభ్యర్థిపై రెండు సారా కేసులున్నాయి. అభ్యర్థుల సమర్థతను జనం గ్రహించాలి. పార్టీలో బలంగా ఉన్న వ్యక్తిని, అధినేతతో నేరుగా మాట్లాడి నిధులు తెచ్చి అభివృద్ధి చేయగల సత్తా ఉన్నవాడిని నేను. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి పరిస్థితిని ఆలోసిస్తే తప్పక తెలుగుదేశం పార్టీకే ఓటు వేస్తారు. అధికార పార్టీ ప్రస్తుత శాసనసభ్యుడికి ప్రతి పనికీ డబ్బు ఇవ్వాల్సిందే నన్న ఆరోపణలున్నాయి. నన్ను ఆశీర్వదిస్తే రాజకీయ అవినీతిని రూపుమాపి, మంచి పాలన అందిస్తా.

చంద్రబాబుతోనే యువతకు భవిత

నారా రోహిత్.. మడకశిర నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం



గుడిబండ రోడ్‌షోలో నారా రోహిత్‌కు గజమాలతో సత్కారం

మడకశిర టౌన్, మే 9:
యువత భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని సినీహీరో నారా రోహిత్ అన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుకు మద్దతుగా నారా రోహిత్ గురువారం రొళ్ల, గుడిబండ మండలాల్లో ప్రచారం చేశారు. రోడ్‌షోలలో పాల్గొన్నారు. మడకశిరలోని యాదవ కల్యాణ మండపంలో యువతతో ముఖాముఖి నిర్వహించారు. నారా రోహిత్ మాట్లాడుతూ.. చంద్రబాబు చేసిన అభివృద్ధిని చూడాలన్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో అభివృద్ధి చెందిదంటే చంద్రబాబు ముందుచూపే కారణమన్నారు. దేశవిదేశాల్లో సైతం చంద్రబాబు ముందుచూపు వల్ల ఉపాధి పొందుతున్నారన్నారు. చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేస్తే పక్క రాష్ట్రాలు, విదేశాల్లో సైతం ఆయనకు మద్దతు లభించడం గమనార్హమన్నారు. ఆయన చేసిన అభివృద్ధే అందుకు కారణమన్న విషయాన్ని యువత గుర్తు పెట్టుకోవాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియ పరిశ్రమ తేవడం ద్వారా ఈ ప్రాంతంలో అనేకమంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. జగన్ అధికారం చేపట్టాక ఒక్క పరిశ్రమైనా ఏర్పాటు చేశారా, యువతకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా, ఒక్క నోటిఫికేషన్ అయినా విడుదల చేశారా అంటూ ప్రశ్నించారు. యువత రాష్ట్ర, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎస్ రాజును గెలిపించుకుంటే ఈ ప్రాంతంలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్‌రాజు, నియోజకవర్గ సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి, సినీనటుడు రఘు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులకైనా నో ఎంట్రీ



ఎన్నికల నిర్వహణలో పోలీసులదే కీలకపాత్ర అభ్యర్థుల ప్రచారాలు, సభలు, ర్యాలీలకు వారి అనుమతులు తప్పనిసరి. పోలింగ్ రోజు ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా బందోబస్తు నిర్వహిస్తారు. అయినప్పటికీ పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా కేంద్రంలోని ఎన్నికల అధికారే పరిష్కరిస్తుంటా రు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప ప్రత్యేక కారణం లేకుండా పోలీసులు పోలింగ్ కేంద్రంలోనికి పోవడానికి అనుమతి లేదు. పోటీ చేసే అభ్యర్థి అయినా, ఇంకా ముఖ్యమైన వ్యక్తి ఓటు వేసేందుకు వచ్చినా వారి భద్రతా సిబ్బంది మాత్రం పోలింగ్ కేంద్రం బయటే ఆగాలి. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బంది కలిగించే ఏ పని కూడా ముఖ్యమంత్రి గాని, మంత్రులు గాని వారి అనుచరులు కాని చేయకూడదు. పదవుల్లో ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించకూడదు. ఎలాంటి మాటలు, సైగలు చేసినా నేరంగా పరిగణిస్తారు. పోలింగ్ సిబ్బంది రాజకీయ నాయకులు, మంత్రుల మాటలు పట్టించుకోకుండా ఎన్నికల సంఘం ఆదేశాలను మాత్రమే పాటించాలి.

- ముదిగుబ్బ

స్థానిక పోరును తలపించేలా...




స్థానిక పోరును తలపించేలా సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోంది. సాధారణంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు గ్రామీణులు అంత ప్రాధాన్యం ఇవ్వరు. ఎన్నికల రోజుకు స్థానికంగా ఉన్నవారితోనే ఓట్లు వేయిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం గ్రామాల్లోని ప్రతి ఓటరు వచ్చేలా చూస్తారు. అయితే ఈ సారి మాత్రం వలస వెళ్లిన వారిని ఎలాగైనా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చి, ఓటు వేయించేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించారు. అన్ని పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్న ఓటర్లను తరలించేందుకు ఎంత మొత్తంలో చెల్లిస్తున్నారో? ప్రయాణ ఖర్చులు ఏ మేరకు భరిస్తున్నారో తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమా వేశాలు ఏర్పాటు చేసి వలస ఓటర్ల కోసం ఆరా తీస్తున్నారు. అంతకు మించి తాయిలాలు ఇచ్చి ఓటర్లను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

- ముదిగుబ్బ

ఓటెలా అడుగుతావ్ జగనన్నా..

ఇచ్చిన మాట తప్పితే ఓటేయొద్దని చెప్పావ్‌గా
జిల్లాకు ఇచ్చిన ఏ హామీ నెరవేర్చావని ఓటెయ్యాలి
ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. పరిశ్రమలు తేలేదు
మాట తప్పావ్... మడమ తిప్పావ్
వైసీపీకి ఓటుతోనే బుద్ధి చెప్తామంటున్న ప్రజానీకం



అనంతపురం, మే 9(ఆంధ్రజ్యోతి) : 'ఇచ్చిన మాట తప్పితే ఓటు వేయొద్దని చెప్పిన దమ్మున్నోడే జగను... చెప్పిన మాట చెప్పినట్లుగా చేసిన మా రాజన్న కొడుకే జగను' అంటూ సాగే పాట ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహించిన ప్రతి బహిరంగ సభలోనూ వినిపిస్తోంది. అయితే ఆ పాటలో చెప్పినట్లుగా జగన్ ఏమాత్రం చేయలేదని జిల్లా ప్రజానీకం మండిపడుతోంది. మాట తప్పం... మడమ తిప్పమని ప్రతి సభలోనూ ఢీంకరించే సీఎం జగన్ జిల్లాకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నది నిర్వివాదాంశం. ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. మద్యపాన నిషేధాన్ని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలోనే ఇచ్చిన మాట తప్పావ్... మరి నీ పార్టీకి ఓటెలా వేయాలని అడుగుతావ్ జగన్ అంటూ జిల్లా ప్రజానీకం ప్రశ్నిస్తోంది. మాట తప్పిన... మడమ తిప్పిన జగన్‌కు ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్తామంటోంది.

ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా..?

ప్రతిపక్ష నేత హోదాలో జిల్లాలో పాదయాత్ర చేశారు. ముఖ్యమంత్రి హోదాలోనూ బటన్ నొక్కుడు కార్యక్రమం పేరుతో అనేక సభలు నిర్వహించారు. ఈ జిల్లా మనవడినంటూ... కరువు జిల్లాను అన్ని విధాలుగా ఆదుకుంటానని అనేక హామీలిచ్చారు. ఆ హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా..? అంటూ జిల్లా ప్రజానీకం ప్రశ్నిస్తోంది.

- జీడిపల్లి నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించేందుకు రూ. 986 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు రూ. 200 కోట్ల పరిహారం వారం రోజుల్లో ఖాతాల్లో జమ చేస్తానని కళ్యాణదుర్గం సభలో చెప్పావ్.. ఇప్పటి వరకూ నెరవేర్చలేదు.
- కృష్ణాజలాలను భైరవానితిప్ప ప్రాజెక్టుకు మళ్లిస్తానని హామీ ఇచ్చి మూడేళ్ల కాలం పూర్తయినా ఇప్పటికీ హామీగానే మిగిలిపోయింది. ఆ ప్రాజెక్టు పూర్తయితే... రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరందేది. అదీ చేయలేదు.
- రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద 4 టీఎంసీల సామర్థ్యంతో టీడీపీ హయాంలో చేపట్టిన నేమకల్లు ఆంజనేయస్వామి బాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇస్తివి. ఇప్పటికీ నెరవేర్చలేదు. జగన్ హామీ ఇస్తే నెరవేరుతాయని బొమ్మనహాళ్, కణేకల్లు, డి. హీరేహాళ మండలాల ఆయకట్టు రైతులు ఆశించారు. కానీ రైతన్నల ఆశలు ఆవిరి అయ్యాయి.
- జిల్లాకు సాగు, తాగునీరందించే హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తామని గొప్పగా చెబితివి. ఐదేళ్లలో గంప మట్టయినా తీయలేదు.
- చాగల్లు రిజర్వాయర్ నిర్మాణంతో ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించారు. ఉల్లికంటిపల్లి గ్రామ ప్రజలకు పరిహారం కింద కొంత సొమ్ము మాత్రమే చెల్లించారు. నూతనంగా గ్రామాన్ని ఏర్పాటు చేసి గృహనిర్మాణాలు చేయించారు. ఆ గృహనిర్మాణాలకు ఇప్పటివరకూ నిధులివ్వలేదు. ఉల్లికల్లు గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు ఆ గ్రామాన్ని వదల్లేక.. ఉండలేక అవస్థలు పడుతున్నారు.
- శింగనమల నియోజకవర్గంలో ఉద్యానపంటలు పండించే రైతులకు ఆదాయం పెంచేందుకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారు.
- ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా ఉపకాలువల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో ఆందోళన చేపట్టావు... అధికారంలోకి రాగానే విస్మరించావని ఆ ప్రాంత రైతులు నిలదీస్తున్నారు.
- రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపంలో దేవరకొండ జలాశయంతో పాటు మరో రెండు రిజర్వాయర్లకు నాలుగేళ్ల కిందట వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసింది నా గుర్తుందా జగనన్నా అంటూ ఆ నియోజకవర్గ ప్రజలు నిలదీస్తున్నారు.

ఇచ్చిన మాట తప్పితే ఓటు వేయొద్దని మీరే చెప్పారు. మరి ఓటేయమని ఇప్పుడు ఎలా అడుగుతున్నావ్ జగనన్నా అంటూ జిల్లా ప్రజానీకం మండిపడుతోంది.

జిల్లాకు ఏం ఒరగబెట్టారని ఓటెయ్యాలి..?

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా లోటు బడ్జెట్ ఉన్నా... ఆగమేఘాల మీద గొల్లపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి, దాని ద్వారా నీటి సౌకర్యం కల్పించి కియతో పాటు అనుబంధ సంస్థలు ఏర్పాటయ్యేలా టీడీపీ అధినేత చంద్రబాబు కృషి చేశారు. కియ ద్వారా ప్రత్యక్షంగా 8 వేల మందికి, పరోక్షంగా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పుకునేందుకు తెలుగుదేశం పార్టీకి నైతికత ఉందన్న అభిప్రాయం జిల్లా ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. మరి కరువు జిల్లాకు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా? ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ హయాంలో అనంతపురం నగర శివారులో దాదాపు 6 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే జాకీ పరిశ్రమను నెలకొల్పేందుకు ఆ సంస్థ ప్రతినిధులు సిద్ధమయ్యారు. అయితే అప్పటి ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవడం.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఎందుకు ఆ పరిశ్రమను ఏర్పాటు చేయలేకపోయిందో బదులివ్వగలరా అని ప్రజలు నిలదీస్తున్నారు. కాసుల కాంక్షతో అధికార వైసీపీ నేతలు ఆ పరిశ్రమ ప్రతినిధులపై ఒత్తిడి తేవడంతోనే పరిశ్రమ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిందన్నది నిజం కాదా అని నిలదీస్తున్నారు. ఎంతసేపూ బటన్ నొక్కుడుతో సంక్షేమం చేపట్టామని చెబుతున్నారేగానీ... జిల్లా అభివృద్ధికి బాటలు వేయలేదన్నది నిజం కాదా అని వైసీపీ ప్రభుత్వాన్ని జిల్లా ప్రజానీకం ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టులు పూర్తయింటే ప్రతి ఎకరాకు సాగునీరు అందడం ద్వారా మా జీవితాలు బాగుపడేవన్న భావన జిల్లా రైతాంగం నుంచి వ్యక్తమవుతోంది. ఆ హామీలు నెరవేర్చకుండా మా జీవితాలతో చెలగాట మాడారనే ఆక్రోశం వారిలో వ్యక్తమవుతోంది. జిల్లాకు ఏం ఒరగబెట్టారని ఓటేయాలని ఆ వర్గాలు వైసీపీని నిలదీస్తుండటం గమనార్హం.

రేయ్.. పరిసిపారేయండ్రా..!

- తాడిపత్రిలో ఓటుకు రూ.2 వేలు
- ఇప్పటికే 95 శాతం పంపిణీ పూర్తి..?
- అవసరమైతే ఇంకో కోటా ఉంటుందట..!



తాడిపత్రి టౌన్, మే 9: రాష్ట్రంలో ఉత్కంఠ రేపే నియోజకవర్గాల్లో ఒకటైన తాడిపత్రిలో డబ్బులను పరిచి పడేస్తున్నారు. 'ఓటు ఎవరికైనా వేసుకో.. నువ్వు ఏ పార్టీ అయినా సరే.. నోటు తీసుకో..' అని మొహమాటం లేకుండా చెప్పేస్తున్నారు. ప్రలోభాలు పీక్స్‌కు చేరాయి. ఓటుకు రూ2 వేల ప్రకారం ఇప్పటికే పంపిణీ పూర్తి అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాడిపత్రి మున్సిపాలిటీతోపాటు గ్రామీణ ప్రాంతాలలో పోలింగ్‌కు మూడు రోజుల ముందే ఈ స్థాయిలో డబ్బులను పంచడం కలకలం రేపుతోంది. నియోజకవర్గంలో ఇప్పటికే వంద కోట్లు పంచేశారని అంటున్నారు.

ఎందుకంటే..

తాడిపత్రి నియోజకవర్గం జేసీ కుటుంబం కంచుకోట. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఇక్కడ మాత్రం జేసీ కుటుంబం జెండా ఎగరాల్సిందే అన్నట్లు రాజకీయం కొనసాగుతోంది. అంచనాలకు భిన్నంగా గత ఎన్నికల్లో మాత్రం ఓటమి ఎదురైంది. కానీ పడిలేచిన కెరటంలా మున్సిపల్ ఎన్నికల్లో జేసీ కుటుంబం సత్తా చాటుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీచినా.. తమ అడ్డాలో మాత్రం కుదరదని 'సైకిల్' సంకేతం పంపింది. దీంతో ఈ ఎన్నికల్లో గెలుపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎలాగైనా విజయం సాధించాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ క్రమంలో ఓటర్లకు భారీగా డబ్బులు, చీరలు, ముక్కుపుడకలు వంటి కానుకలు చేరుతున్నాయి.

ఎంతైనా సరే..

తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 2,48,880. వీరిలో సాధ్యమైనంత మందికి డబ్బులు పంపిణీ చేయాలని అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఓటుకు రూ.2వేలు పంపిణీ చేశారని బహిరంగ చర్చ నడుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో నగదుతోపాటు కానుకలు కూడా ఇస్తున్నారట. ఇవికాక.. గంపగుత్త ఓట్ల కోసం పెద్ద ఎత్తున డిన్నర్లకు సిద్ధమవుతున్నారు. 'ఇప్పటికే పంచేశాం. ఇంకా అవసరమైనా ఇచ్చేద్దాం. ఏం జరుగుతోందో నిఘా వేయండి..' అని కిందిస్థాయి నాయకులను పురమాయించినట్లు తెలిసింది. మిగిలిన మూడు రోజులు ఓట్లు, మద్యం, కానుకల జాతరేనని అంటున్నారు.

బయటివారే సేఫ్

ఎన్నికల్లో డబ్బుల పంపిణీకి లెక్కాజమ ఉండదు. ఇచ్చిన సొమ్ము ఓటర్లకు చేరుతోందో లేదో తెలియదు. అందుకే లోకల్ వద్దు.. నాన్ లోకల్ మేలు అని అధికార పార్టీవారు బయటివారిని రప్పించినట్లు సమాచారం. సాధారణంగా చీకటి పడ్డాక, అర్ధరాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా డబ్బుల పంపిణీ జరుగుతుంది. కానీ ఈ ఎన్నికల్లో 'మమ్మల్నెవరు ఆపేది..?' అన్నట్లుగా అధికార పార్టీవారు పట్టపగలే డబ్బులను పంచేస్తున్నారు. అధికారులు పట్టించుకోడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గంటన్నరలో అయిపోవాలి..!

అనంతపురం క్రైం: జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో డబ్బుల పంపిణీకి అధికార పార్టీ అన్ని ఏర్పాట్లు చేసుకుంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నాయకులు నోట్ల కట్టలను బయటకు తీస్తున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే పంపిణీ మొదలైంది. ఎక్కువ ప్రాంతాల్లో పోలింగ్‌కు రెండు రోజుల ముందు పంచాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత రోజు చుక్క, ముక్క ఏర్పాటు చేస్తారని సమాచారం. 2019 ఎన్నికల్లో కూడా వైసీపీ నాయకులు ఇదే వ్యూహాన్ని అమలు చేశారు. అంత ఉత్కంఠ లేని ప్రాంతాలలో ప్రత్యర్థుల ఎత్తుగడలను పసిగట్టి.. అవసరమైతే ఓటుకు రూ.1500 పంచడానికైనా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గట్టి పోటీ ఉన్నచోట్ల ఎంత పంపిణీ చేస్తారో అంచనాలకు అందడం లేదని జనం వ్యాఖ్యానిస్తున్నారు. పంపిణీ బాధ్యతలు తీసుకున్న కీలక నేతల అనుచరవర్గాలు స్థానిక నాయకులకు కొన్ని సూచనలు ఇచ్చారట. తమ సమక్షంలో డబ్బులు పంచాలని షరతు పెట్టినట్లు సమాచారం. ఒక్కో ఇంట్లో ఎన్ని ఓట్లున్నాయో గుర్తించి, నిమిషాల వ్యవధిలో డబ్బులు ఇచ్చేయాలని.. ఊరు మొత్తం గంట.. గంటన్నరలోగా పంపిణీ పూర్తవ్వాలని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. పెద్ద గ్రామమైతే మరో అరగంట టైమ్ తీసుకోవాలని, అంతకంటే ఎక్కువ సమయం తీసుకోకూడదని సెలవిచ్చారట.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి



కురుబల సమావేశానికి హాజరైన బాలకృష్ణ, బీకే పార్థసారథి

సైకో ప్రభుత్వంతో రాష్ట్రం అల్లకల్లోలం

అభివృద్ధి, సంక్షేమం కావాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలి
ఎన్నికల ప్రచారంలో బీకే పార్థసారథి

హిందూపురం, మే 9 : సైకో పాలనతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, ప్రజలకు సంక్షేమం ఒకటే సరిపోదని అభివృద్ధి కూడా ముఖ్యమని తెలిపారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో చెప్పుకోదగ్గ ఒక్క పనికూడా చేయలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా ఉమ్మడి ప్రభుత్వంతో సాధ్యం అవుతుందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

టీడీపీతోనే కురుబల అభివృద్ధి

రాష్ట్రంలో కురుబ కులస్థులు తెలుగుదేశం పార్టీ వెంటే ఉన్నారని, వారికి కూడా పార్టీ అండగా ఉంటూ పెద్దపీట వేస్తోందని బీకే పార్థసారథి అన్నారు. హిందూపురం జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కురుబలకు పెద్దపీట వేసిందన్నారు. తాను పంచాయతీ స్థాయి నుంచి ఎంపీ వరకు ఎదిగానంటే తెలుగుదేశం పార్టీయే మూలమన్నారు. పార్టీ ఎప్పుడూ బడుగు బలహీనవర్గాల కోసం కృషి చేస్తుందని అన్నారు. భవిష్యత్తులో కూడా కులస్థులకు చంద్రబాబు, బాలకృష్ణ అండగా ఉంటారని మనమంతా టీడీపీని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గోరంట్ల ప్రచారంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని చెరువులకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గోరంట్లలో తెలుగుదేశం పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారథికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ మాట్లాడుతూ వైసీపీ కమీషన్లకు కక్కుర్తి పడటంతో అభివృద్ధి పనులు ముందుకు సాగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గోరంట్ల మండలంలో ప్రతి చెరువుకు నీరిచ్చే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



గుత్తిలో డీజిల్ షెడ్‌లో కార్మికులతో అంబికా లక్ష్మీనారాయణ



యాడికి సమావేశంలో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

అనంతపురం టీడీపీ లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

గుత్తి, మే 9: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ అనంతపురం లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే డీజిల్ షెడ్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన డీజిల్ షెడ్, సీఅండ్‌డబ్ల్యూతో పాటు పలు విభాగాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని ఆయన ప్రచారం చేశారు. అనంతరం ఆయన కార్మికులతో మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే జోన్ ఏర్పాటుకు ఆహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధితో పాటు, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఏర్పాటుకు, రైల్వే ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డీజిల్ షెడ్ నుంచి మెయిన్ రోడ్డులో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో పెరిగిపోయిన అరాచకాలు, దౌర్జన్యాలకు చరమగీతం పాడాలంటే టీడీపీకి ఓటు వేసి గెలపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు ముష్టూరు తిమ్మప్ప, ఎంగన్నపల్లి సర్పంచు భరత్‌కుమార్, న్యాయవాది సోమశేఖర్, డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జావిద్, జనసేన నాయకులు పూల రమణ, గోవింద రాజులు, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌చౌదరి, వీరన్న, రాము, వెంకటరాముడు పాల్గొన్నారు.

పోరాడితే విజయం మనదే

యాడికి : పోరాడితే విజయం మనదేనని అనంతపురం టీడీపీ లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం యాడికిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి అతికొద్ది సమయం మాత్రమే ఉందని, అంతా కలిసికట్టుగా పోరాడితే కూటమి అభ్యర్థులదే విజయమని తెలిపారు. ప్రతిఓటరును కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఓటింగ్ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓటింగ్ శాతం పెరిగేలా అవగాహన పెంచాలని తెలిపారు. పోలింగ్ రోజున వైసీపీ కుట్రలకు తెరలేపడానికి సిద్ధమవుతోందని, వాటిని దీటుగా ఎదుర్కోగలిగితే విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు రాజశేఖర్‌నాయుడు, ఆదినారాయణ, విక్రమ్, నరసింహచౌదరి పాల్గొన్నారు.

తాగుదాం.. ఊగుదాం..!

ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. నగరంలో గత కొన్ని రోజులుగా దుకాణాలు తీయడమే ఆలస్యం అక్కడ ఇట్టే మద్యం ప్రియులు వాలిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉదయం నుంచే మద్యం ప్రియులు బారులు తీరుతున్నారు. ప్రస్తుతం బరిలో నిలిచిన అభ్యర్థులు అటు ప్రచారం.. ఇటు ఓటు కోసం డబ్బులు పంపిణీ చేస్తుండటం మద్యం ప్రియులకు కలిసి వచ్చినట్లైంది. కొందరైతే వివిధ పార్టీల జెండాలు, కండువాలు, టోపీలతో దుకాణాల వద్ద కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు మద్యం ప్రియులు తాము చేసే పనులు పక్కన బెట్టి డబ్బు, మద్యం కోసం అభ్యర్థుల చుట్టూ తిరుగుతున్నారు. మద్యం దొరగ్గానే పూటుగా తాడి ఊగేస్తున్నారు.

- అనంతపురం సిటీ



నగరంలోని ఓ మద్యం దుకాణాల వద్ద ఇలా...



చీనీ మార్కెట్ బంద్

అనంతపుంరూరల్, మే 9: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ యార్డు ఉద్యోగులు, సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించిన కారణంగా ఈనెల 12న (ఆదివారం) ఎద్దులు, ఎనుముల సంత, 13న (సోమవారం) చీనీ కాయల మార్కెట్‌ను బంద్ చేస్తున్నట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రైతులు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ రెండు రోజులు చీనీకాయలు, పశువులను మార్కెట్‌కు తీసుకురావద్దని ఆమె సూచించారు.

ఓటు అమ్ముకోం.. భవిష్యత్తును పోగొట్టుకోం

ఎన్నికల వేళ... ఒక ఉపాధ్యాయుడు వినూత్నంగా ఓటు విలువపై ప్రచారం చేశారు. ఓటును అమ్ముకోం. ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును పోగొట్టుకోలేమని చెబుతూ తన ఇంటిపై ఫ్లెక్సీ అతికించారు. ఉపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్ అనంతపురంలోని జీసస్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన ఇంటిపైన ఒక ఫ్లెక్సీని పెట్టించారు. ఓటు హక్కును నిజాయతీగా వినియోగించాలని, జీవుల మనుగడకు ప్రాణవాయువు ఎలాగో... ప్రజాస్వామ్యానికి ఓటు ఆక్సిజన్ వంటిదని సూచిస్తూ... ఫ్లెక్సీ అతికించారు. ఉద్యోగుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తికే ఓటు వేస్తామని అందులో స్పష్టం చేశారు. ఆయన వినూత్న పంథా, ఓటుపై ప్రచారం అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటోంది.

- అనంతపురం విద్య



ఇంటికి తగిలించిన ఫ్లెక్సీ వద్ద విజయ్‌భాస్కర్

బొమ్మా.. బొరుసా..?



ఏమన్నా ఎవరు గెలుత్తారంటావ్? ఆ పార్టీ వోల్లకి ఎన్ని సీట్లు వత్తాయ్? ఇంతకీ మన నియోజకవర్గంలో పరిస్థితి ఏంటంటావ్? ఇదీ ప్రస్తుతం నలుగురు కలిసిన చోట జరుగుతున్న సంభాషణ. ప్రశ్న అడిగిన వారికి అనుకూలంగా సమాధానం వస్తే ఓకే.. లేదంటే పందెమా అంటూ పోటీలు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎండల వేడి కాస్త తగ్గినా ఎన్నికల వేడి మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఇది బెట్టింగ్‌కు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లాలో టీడీపీకి పది సీట్లకు పైగా వస్తాయంటూ కొందరు .. లేదు..లేదు వైసీపీకే వస్తాయంటూ మరి కొందరు పోటాపోటీగా బెట్టింగు లకు దిగుతున్నారు. అలాగే కూటమి 110 సీట్లతో అధికారంలోకి వస్తుందని, వైసీపీకి 63 కంటే తక్కువ సీట్లు వస్తాయని పందేలు జరుగుతున్నాయి. దీనికితోడు ఎమ్మెల్యే అభ్యర్థి గెలుస్తారు. వంటివాటిపై జోరుగా బెట్టింగు జరుగుతోంది. అనంతపురం మండలం పరిధిలోనే దాదాపు రూ.50 కోట్లకుపైగా బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ఇప్పటికే మధ్యవర్తుల దగ్గర ఇరు వర్గాల పందెంరాయుళ్లు సొమ్మును కలిపి తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. మరికొందరు ఇప్పటికీ పందేలు కాస్తున్నారు. అలా ఒక్కొక్కరు లక్షల్లో బెట్టింగ్ కాసినట్లు తెలుస్తోంది. సీఎంగా చంద్రబాబు నాయుడా..లేక జగన్ మోహన్‌రెడ్డి అవుతారా అన్నదానిపై ఎక్కువగా బెట్టింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అలాగే పరిటాల సునీత గెలుస్తుందని ఎక్కువ శాతం మంది పందెం కాసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు సైతం ఆమే గెలుస్తుందని పందెం కాసినట్లు సమాచారం. గెలిచేదెవరో.. మునిగేదెవరో జూన్ 4న తేలనుంది.

- అనంతపురం రూరల్

ఈడా.. ఆడా.. కూడా..



ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో కూలీలకు భలే డిమాండ్ ఏర్పడింది. ఒక్కో అభ్యర్థి వెంట ప్రచారానికి వెళ్తే ఒక్కొక్కరికి రూ.500 ఇస్తున్నట్లు సమాచారం. ఇలా రోజంతా ఒక అభ్యర్థి వెంటే ఉంటారు అనుకుంటే పొరపాటే!. పొద్దున ఒక పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం, మధ్యాహ్నం మరో పార్టీ అభ్యర్థి తరఫున, సాయంత్రం ఇంకో అభ్యర్థి వెంట ప్రచారానికి వెళ్తూ జేబు నింపుకుంటున్నారు. అభ్యర్థులు కూడా తమవెంట ఎంత జనం ఉంటే అంత క్రేజ్ ఉంటుందన్న భావనతో... ఎంతమంది వస్తే అంత మందిని తమవెంట వేసుకొని ప్రచారాలు సాగిస్తున్నారు. ఎంత డబ్బు ఖర్చయినా వెనకాడటం లేదు. ప్రచారం రెండు రోజుల్లో ముగియనుండటంతో కూలీలకు డిమాండ్ మరింత పెరిగింది.

- అనంతపురం ప్రెస్‌క్లబ్

దుడ్లు తీసుకుని ఓటేస్తే విలువ ఉండదు



నియోజకవర్గంలో అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేయాలి. దుడ్లు తీసుకొని ఓటు వేస్తే విలువ ఉండదు. గత ఎన్నికల్లో వైసీపీ ఆటో డ్రైవర్లకు అనేక హామీలు ఇచ్చింది. నమ్మి అందరం ఓటేశాం. సంవత్సరానికి రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇలా రూ.10వేలు ఇచ్చి.. పెట్రోల్, డీజిల్ 10 సార్లు పెంచి ఆ దుడ్లు ఇలాగే లాగేశాడు. తప్పుడు హామీలతో జగన్‌రెడ్డి మోసం చేశాడు. చంద్రబాబు హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉండేవి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీలతో వాహనాలు ఇచ్చేవారు. ఐదేళ్లలో సబ్సిడీతో వాహనాలు ఇచ్చిన దాఖలాలు లేవు.

- శివకుమార్, ఆటోడ్రైవర్, శింగనమల

ఆ మూడు పంచాయతీల్లో వారే కీలకం




తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ శీర్పి, తగ్గుపర్తి, నరసాపురం పంచాయతీల్లో తిరుగులేని మెజార్టీ సాధిస్తోంది. ఈ గ్రామాల్లో కమ్మ సామాజికవర్గ ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో అక్కడ పట్టు సాధించడానికి ప్రత్యర్థి పార్టీ విశ్వప్రయత్నాలు సాగిస్తున్నా సాధ్యం కావడం లేదు. ఆ గ్రామాల్లో ఉన్న ఇతర సామాజిక వర్గాలను కలుపుకుని టీడీపీ ప్రతి ఎన్నికల్లోనూ ముందంజలో ఉంటోంది. మండలంలో కొన్ని గ్రామాల్లో వైసీపీ మెజారిటీ సాధించినా ఈ గ్రామాల్లో టీడీపీ మెజారిటీ ప్రత్యర్థి పార్టీని దడ పుట్టిస్తుంది. శీర్పి పంచాయతీలో వెంకటాద్రిపల్లి, శీర్పి, కోనాపురం గ్రామాలున్నాయి.

- బెళుగుప్ప

అధములైన ప్రథములు





వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం
నిధులు లేవు.. విధులూ లేవు..
కేంద్రం నిధులు సైతం పక్కదారి
ఊళ్లొదిలి వలస కూలీలుగా మారిన దైన్యం
జగన్‌ను దించడానికి సిద్ధమంటున్న సర్పంచులు

గ్రామానికి సర్పంచే ప్రథమ పౌరుడు. ఎంత పెద్ద సభ జరిగినా సర్పంచుకు ప్రత్యేక గౌరవం ఉంటుంది. తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎందరో ఉత్సాహంతో పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. వీరిలో వైసీపీ సానుభూతిపరులే అత్యధికంగా ఉన్నారు. కానీ వారి ఆశలపై ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నీళ్లుచల్లారు. నిధులు లేవు, విధులూ లేవు. ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. కనీసం వీధి దీపాలు, బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పైసల్లేని దైన్యం. మొత్తంపై పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. దీంతో జగన్‌పై ఆగ్రహంగా ఉన్న సర్పంచులు ఆయనను గద్దె దించడానికి సిద్ధమవుతున్నారు.

అనంతపురం న్యూటౌన్

తమకు అధికారాలు, విధులు లేకుండా చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని గద్దె దించడానికి సిద్ధమంటున్నారు సర్పంచులు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పంచాయతీలపై జగన్ శీతకన్ను వేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఒక్క పైసా కూడా కేటాయించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అర్ధరాత్రి నిధులు కేటాయిస్తున్నట్లు జీఓ జారీ చేయడం, తెల్లారగానే ఆ నిధులను తిరిగి మరో ఖాతాకు మళ్లించడం వైసీపీ ప్రభుత్వం తంతుగా మారింది. ఆఖరికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం రూ.8,629 కోట్లు పంచాయతీలకు చెందకుండా సొంత పథకాల అమలుకు మళ్లించడంతో పంచాయతీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలకు గాను 1044 పంచాయతీలు ఉంటే ఇందులో 15 శాతం మాత్రమే తెలుగు దేశం పార్టీ మద్దతుదారులు ఉన్నారు. మిగిలిన వారంతా వైసీపీ సర్పంచులే. అయినా కనికరం లేని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సొంత పార్టీ వారికి కూడా షాకిచ్చారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో సర్పంచుగా గెలిచి ప్రజలకు సేవ చేయాలన్న ఉత్సాహం ఉన్న వారికి చేదు అనుభవమే ఎదురైంది. ఎన్నికల ముందు సర్పంచులుగా ఎన్నికైన వెంటనే గ్రామంలో అది చేస్తాం.. ఇది చేస్తాం అని హామీలు ఇచ్చిన వారు ఆఖరికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కొందరు.. ఆ పంచాయతీలో తిరగలేక ఇతర రాష్ట్రాలకు వెళ్లి వలస కూలీలుగా మారారన్న చర్చ జరుగుతోంది. ఆర్థికంగా ఉన్న కొందరు ఎన్నికల హామీలు అమలు చేయడంలో భాగంగా ఆయా పంచాయతీల్లో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టి బిల్లులు రాక ఆర్థికంగా చితికిపోయినట్లు ఆ వర్గాలే చెబుతున్నాయి. ఇంత దారుణమైన పరిస్థితులు తెచ్చిపెట్టిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి సర్పంచులు సిద్ధంగా ఉన్నట్లు ఆ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఆదరణ లేక టీడీపీలో చేరిక

వైసీపీ ప్రభుత్వం నుంచి గానీ, స్థానిక నాయకుల నుంచి గానీ తగిన ఆదరణ లేకపోవడంతో వైసీపీ మద్దతు సర్పంచులు చాలా మంది టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ మధ్య కాలంలోనే అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల పంచాయతీ వైసీపీ మద్దతు సర్పంచ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం కండువా కప్పుకొన్నారు. ఇదే తరహాలో పలువురు సర్పంచులు జగన్ పార్టీకి దూరమయ్యారు.

ఓటు అడిగే హక్కు కోల్పోయారు

సర్పంచులుగా ఎన్నికైన వారు వైసీపీ ప్రభుత్వం చేసిన ఘనకార్యానికి ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కును సైతం కోల్పోయారు. ఐదు సంవత్సరాల్లో నిధులు కేటాయించకపోగా.. కేంద్రం విడుదల చేసిన నిధులను సైతం సొంత పథకాల అమలుకు దారి మళ్లించిన ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుంది. పంచాయతీల్లో ఏ ఒక్క చిన్న సమస్యను పరిష్కరించలేని నిస్సహాయ స్థితికి సర్పంచులు చేరారు. ఆఖరికి చెత్త శుభ్రం చేయడానికి కేటాయించిన గ్రీన్ అంబాసిడర్స్‌కు కూడా వేతనం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారు ఉద్యోగాలు మానుకున్నారు.



- ఇస్మాయిల్, రాష్ట్ర కార్యదర్శి, పంచాయతీరాజ్ చాంబర్


బిల్లుల చెల్లింపులు లేక వలసబాట



కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 14,15 వ ఆర్థిక సంఘం నిధులను సైతం సొంత తమ పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది. గ్రామంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఇతర రాష్ట్రాలకు వలసపోయి తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని పంచాయతీల్లో రూ.10 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు బిల్లులు పెండింగ్ పెడితే సర్పంచులు ఎలా మనుగడ సాధిస్తారు. ఇంత చెత్త ప్రభుత్వం ఎక్కడా ఉండదు.

-కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పంచాయతీరాజ్ చాంబర్

నాలుగు సంవత్సరాలాయె రాకపోకలు ఆగిపాయె...




బెస్తరపల్లి నుంచి జంబుగుంపల మధ్య తెగిపోయిన రహదారి

కుందుర్పి మండల పరిధిలోని బెస్తరపల్లి నుండి జంబుగుంపలకు వెళ్లె రహదారి భారీ వర్షాలకు పూర్తిగా తెగిపోయింది. ఆ రెండు గ్రామాలకు వెళ్లే బస్సులు సైతం ఆగిపోయాయి. నాలుగు సంవత్సరాలైన ప్రభుత్వ పాలకులు పట్టించుకోకపోవడంతో ఆ రెండు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు పనులకు శంకుస్థాపనలు చేసి వదిలేసారే తప్ప వాటిని పట్టించుకోని నాయకులు కరువయ్యారు. నాలుగు సంవత్సరాల నుంచి రాకపోకలు ఆగిపోయిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాయకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు హామీలు ఇవ్వడం తప్ప నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆ గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శించుకుంటున్నారు.

- కుందుర్పి

ఖనిజం లూటీ..!



తవ్వేసిన లీజు ప్రాంతం

సరిహద్దులు దాటిన ఇనుప ఖనిజం
ఐదేళ్లలో రూ.10 కోట్ల దోపిడీ
అసలు స్థానంలో నకిలీ ఉంచుతున్న వైనం
బరితెగించిన వైసీపీ నాయకులు

రాయదుర్గం, మే 9: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఉండే ఇనుప కొండలను కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లుగా యథేచ్ఛగా తవ్వేశారు. దాదాపు రూ. 10 కోట్లకు పైగా విలువైన ముడిఖనిజాన్ని దోపిడీ చేసి సరిహద్దులు దాటించి జేబులు నింపుకున్నారు. డీ.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం, సిద్ధాపురం, మలపనగుడి గ్రామాలకు ఆనుకుని ఉన్న ఇనుప ముడిఖనిజపు కొండల్లో రాత్రిపూట మాత్రమే ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతుం టాయి. దీని వెనుక వైసీపీ గ్యాంగ్ వ్యవహారాన్ని చక్కదిద్ది రూ.కోట్లు దోచుకుంటోంది. ఇందులో అధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు సమాచారం.

సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని కూడా..

ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి సంబంధించి జరిగిన అవినీతి, అక్రమాల వ్యవహారంలో తవ్వకాలు సాగిస్తున్న ఇనుప కొండల్లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని కూడా దోచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా సీబీఐ 1.5 లక్షల మెట్రిక్ టన్నుల విలువైన ముడి ఖనిజాన్ని సీజ్ చేసింది. అయితే నిల్వ చేసిన ప్రాంతం నుంచి ఆ ఖనిజాన్ని రాత్రి సమయాల్లో వైసీపీ నాయకుల అండతో కొందరు సరిహద్దు దాటించారు. తరలించిన ఖనిజం స్థానంలో ఏ మాత్రం పనికిరాని లో గ్రేడ్ ఖనిజమట్టిని తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ఏళ్ల తరబడి సీజ్ చేసి, నిల్వ చేయడంతో వర్షానికి అందులోని నాణ్యత తగ్గి మట్టిగా మారిందని అధికారులకు చెబుతున్నట్లు సమాచారం.

ఒప్పందాలతో తరలింపు

ముడిఖనిజాన్ని అక్రమంగా తరలించేందుకు వాహనదారులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం వ్యవహారంలోని ఒక పద్ధతి. వైసీపీ నాయకులు ఏ మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించకుండా టిప్పర్ల యజమానులకు పూర్తి బాధ్యతను అప్పగించి తరలించేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అక్రమంగా తవ్వకాలు చేసిన ఖనిజం, సీజ్ చేసిన ఖనిజం, ఇతర మైనింగ్ లీజు ప్రాంతాలలో నిల్వ ఉన్న ఖనిజాలను అక్కడ నుంచి లోడింగ్ చేసు కుని కర్ణాటకలోని క్రషర్లకు రవాణా చేయడం ఆయా టిప్పర్ల యజమానుల ఒప్పందంలో భాగం. రవాణా పరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పూర్తి బాధ్యత టిప్పర్ యజమానులదే. అన్‌లోడింగ్ చేసిన అనంతరం దీనికి సంబంధించిన సొమ్ము వైసీపీ నాయకులు వారికి చెల్లిస్తారు. ఈ పద్ధతి ఐదేళ్ల పాటు యథేచ్ఛగా సాగుతోంది.



ఇనుప ముడిఖనిజం కొండలు

అధికారుల కనుసన్నల్లోనే..

వైసీపీ అధికారంలో ఉండటంతో ఇనుప ముడి ఖనిజం అక్రమ తరలింపును కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కొందరు ఉన్నతస్థాయి అధికారులు ఈ దందా వెనుక క్రియాశీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ముడుపులతో సరిపెట్టుకుని వ్యవహారాన్ని చూసీచూడనట్లుగా ఉంటూ వస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రం ట్రాక్టర్లను పట్టుకువచ్చి చిన్నపాటి కేసులు పెట్టి వదిలేసినట్లు పోలీసులపై ఆరోపణలున్నాయి. పైగా పోలీ సులకు నెలవారి మామూళ్లు కూడా చెల్లిస్తూ వచ్చినట్లు వైసీపీ నాయకు లపై ఆరోపణలు వస్తున్నాయి. ఐదేళ్ల పాటు యథేచ్ఛగా సాగిన ముడి ఖనిజపు లూటీ దందాలో కొందరు వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తి కర్ణాటకలో దర్జాగా వ్యాపార వ్యవహారాలను నిర్వహించుకుంటున్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోంది.

పునాదుల్లో జగనన్న కాలనీలు

కూడేరు, మే 9 : గూడులేని నిరుపేదలకు గూడు కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలకు క్షేత్రస్థాయిలో ఆచరణకు ఏమాత్రం పొంతనలేదు. వైసీపీ అధికారంలోకి రాగానే జగనన్న కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంతో ఆర్భాటం చేశారు. గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి గ్రామాలనే నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రగల్భాలు పలికారు. చివరికి జగనన్న కాలనీల్లో కంపచెట్లు పెరిగిపోయాయి. కూడేరు మండలంలో 19 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేయగా అందులో 332 గృహాలు మంజూరు చేశారు. ఇందులో 128 ఇళ్లు పూర్తికాగా, 20 ఇళ్లు గోడల వరకు నిర్మాణం చేశారు. మిగిలిన 161 ఇళ్లు బేస్‌మట్టానికి పరిమితం కాగా, 23 ఇళ్లు పునాదుల వద్దే నిలిచిపోయాయి. మండలంలోని కూడేరు 1, కూడేరు 2, కడదరకుంట, చోళసముద్రం, గొట్కూరు, రామచంద్రపురం, తిమ్మాపురం, జయపురం, ముద్దలాపురం, జల్లిపల్లి, అరవకూరు, జల్లిపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేశారు. జగనన్న లేఅవుట్లు అనువుగాని చోట మంజూరు చేయడంతో ఇళ్ల నిర్మాణం నత్తనడకన జరిగాయి. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణమే జరగలేదు. దీంతో జగనన్న కాలనీలో కంపచెట్లు పెరిగిపోయాయి. కూడేరు, అరవకూరు, ముద్దలాపురం, గొట్కూరు గ్రామాల్లో మాత్రమే కొంత నిర్మాణాలు చేపట్టగా మిగిలిన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం నత్తనడకన జరిగాయి. చోళసముద్రం, రామచంద్రపుం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలే జరగలేదు. అందుకు కారణం గ్రామానికి దూరంగా స్థలాలు కేటాయించడమే. మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కంటే కంపచెట్లు అధికంగా పెరిగిపోయాయి.



కడదరకుంట గ్రామంలో జగనన్న కాలనీ దుస్థితి

వైసీపీలో అసంతృప్తి

అన్నివర్గాల నుంచి టీడీపీలోకి వలసలు
కరుడుగట్టిన నాయకులు సైతం
వైసీపీని వీడుతున్న వైనం
గుంతకల్లులో గుమ్మనూరు మార్క్



టీడీపీలో చేరుతున్న వైసీపీ ఆవిర్భావం నుంచి ఉన్న కురుబలు

గుంతకల్లు, మే 9: నియోజకవర్గ కేంద్రంలో వైసీపీకి రోజూ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ గూటికి చేరుతున్నారు. వైసీపీ శ్రేణుల తీవ్ర అసంతృప్తి జ్వాల ఆ పార్టీకి అశనిపాతంగా మారింది. ఎన్నికల సైరన్ మోగినప్పటి నుంచి టీడీపీలో ఎప్పుడెప్పుడు పార్టీ అభ్యర్థిని ప్రకటిస్తారా? అని వైసీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎదురు చూశారు. ప్రతిరోజూ టీడీపీ అభ్యర్థి ఎవరంటూ వాకబుచేస్తూ వచ్చారు. గుమ్మనూరు జయరాం పేరును ప్రకటించగానే పోలోమంటూ వైసీపీని వీడి పసుపు కండువాలు తొడుగుతున్నారు. టీడీపీ నుంచి ఒక్క ప్రజాప్రతినిధీ అటువైపు వెళ్లకపోగా, వైసీపీ నుంచి కౌన్సిలర్లు, జడ్పీటీసీ సభ్యుడు, వార్డు ఇన్చార్జిలు, వైసీపీకి ఓటు బ్యాంకు అని చెప్పుకోదగ్గ ముస్లిం, కురుబ వర్గాలు ఆ పార్టీని వీడి టీడీపీకి చేరుతున్నారు. వెళ్లేవారి విషయం తెలిసి వారికి బతిమాలుకోవాల్సిన పరిస్థితి వైసీపీలో ఏర్పడింది.

వైసీపీ చేజారుతున్న గుంతకల్లు

గుంతకల్లు పట్టణం కాంగ్రెస్‌కు ఆ తర్వాత, వైసీపీకి కంచుకోటగా పేరుపొందింది. గుంతకల్లు పట్టణ ఓట్లతో మధుసూదన్, నీలావతి, తదితర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మెజారిటీలు సాధించారు. 1999లో మినహా టీడీపీకి గుంతకల్లులో ఏ ఎన్నికల్లోనూ లీడ్ సాధ్యపడలేదు. 2014లో టీడీపీ వేవ్‌లోనూ వైసీపీ 500 ఓట్ల పైచిలుకు మెజారిటీని ఇచ్చింది గుంతకల్లు పట్టణం. 2019లో 20 వేల కంటే ఎక్కువ మెజారిటీ పట్టణంలో వైసీపీకి లభించింది. పట్టణంలో ముస్లిం మైనార్టీలు, కురుబలు, ఎస్సీ ఎస్టీలు, క్రైస్తవుల ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో ఎన్నికల్లో వైసీపీకి మెజార్టీ లభిస్తూ వస్తోంది. ఈ కారణంగా గుంతకల్లు పట్టణ ఓటు ఈ ఎన్నికల్లో అత్యంత కీలకంగా మారింది. విషయాన్ని గ్రహించిన టీడీపీ అభ్యర్థి జయరాం ఎలాగైనా పట్టణంలో ఆధిపత్యాన్ని చాటుకోవడానికి ప్రత్యేక దృష్టిని సారించారు. గుత్తి, పామిడి పట్టణాలు, మూడు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి అనూహ్య స్పందన లభిస్తుండటంతో పట్టణంలోనూ పైచేయి సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకోవడానికి వ్యూహాన్ని రచించారు. ఈ నెల 1వ తేదీ నుంచి పట్టణంలో ప్రచార కార్యక్రమాన్ని, చేరికలను ముమ్మరం చేశారు. రోజూ పార్టీని వీడుతుండటంతో వైసీపీకి గుంతకల్లు పట్టణం చేజారే పరిస్థితి ఏర్పడింది.

మైనార్టీలు, కురుబలు, దళితుల ఓట్లే లక్ష్యం

గుంతకల్లు పట్టణంలో అత్యధిక ఓట్లు కలిగిన వర్గంగా వాల్మీకులు నిలుస్తుండగా, అభ్యర్థి జయరాం ఆ సామాజిక వర్గానికి చెందినవారే కావడం సహజంగానే కులస్థుల నుంచి అమోఘమైన మద్దతు లభించింది. తర్వాతి స్థానాలలో ముస్లిం మైనార్టీలు, కురుబలు, ఎస్సీ-ఎస్టీలు ఉన్నారు. అలాగే వైసీపీకి బలంగా ఉన్న క్రిస్టియన్ ఓట్లను కొల్లగొట్టడానికి, పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న రైల్వే ఉద్యోగుల ఓట్లపై కూడా ప్రత్యేక దృష్టిని నిలిపారు. ఆ కృషి ఫలితంగానే వైసీపీ నుంచి నలుగురు కౌన్సిలర్లు, గుంతకల్లు మండల జడ్పీటీసీ సభ్యుడు, వార్డు ఇన్చార్జులు, పాతగుంతకల్లులో పెద్ద ఓటుబ్యాంకుగా ఉన్న పాతగుంతకల్లుకు, కనకవీడు వీధికి చెందిన కురుబలు, పట్టణంలోని ముస్లిం నాయకులను ఆకర్షించి పార్టీలో చేర్చుకున్నారు. వైసీపీకి పట్టున్న ఓట్లపైనే బలమైన దెబ్బతీస్తే తిరుగులేని మెజారిటీ సాధ్యమవుతుందన్న వ్యూహంతో పావులు కదిపారు. టీడీపీలో చేరిన కురుబలు వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే ఉన్నారు. వారు ఇప్పుడు టీడీపీ పక్షాన చేరడంతో అధికార పార్టీ ఓటు బ్యాంకుకు గండిపడిందనే భావించాలి. అలాగే ముస్లిముల్లోని రెండు వర్గాల వారినీ అక్కున చేర్చుకుంటూ టీడీపీ చేస్తున్న ముప్పేట దాడితో వైసీపీ శిబిరంలో గందరగోళం ప్రారంభమైంది. కరుడుగట్టిన వైసీపీ శ్రేణులు పార్టీని వీడుతుండటం, వారి ఓట్లు ఇటు తగ్గి అటు పెరిగితే ప్రతి ఓటూ రెండుగా భావించాల్సిన పరిస్థితిలో ఈ వలసలను ఎలా ఆపాలో తెలియని పరిస్థితి అధికార పార్టీలో నెలకొంది.

టీడీపీలోకి భారీగా చేరికలు



ధర్మవరంలో టీడీపీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

ధర్మవరం, మే 9: పట్టణంలోని 26వ, 10వ వార్డులకు చెందిన 40 మంది వైసీపీ శ్రేణులు గురువారం టీడీపీలోకి చేరారు. ఆయా వార్డుల టీడీపీ నాయకులు చీమల నాగరాజు, రామచంద్రల ఆధ్వర్యంలో వారు స్థానిక పరిటా క్యాంపు ఆఫీస్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను కలిసి ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిదంగా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నారా నారాయణప్ప, నారాసాయికుమార్, మనోహర్, రమణ, రాజా తదితరులు అనంతపురంలో పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు.

ధర్మవరం రూరల్: మండలంలోని చింతలపల్లి పంచాయతీ వసంతపురం గ్రామానికి 30కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో గ్రామానికి చెందిన నాగరాజు, రమేష్, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, మహేష్, ప్రసాద్, మల్లేష్, గంగప్ప, సంజీవరాయుడు, ఈశ్వరయ్యతో పాటు పలు కుటుంబాల వారు పరిటాలశ్రీరామ్‌ను కలిసి ఆయన సమక్షంలో చేరారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌ను, టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్‌నాయకులు మహేష్‌చౌదరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరిక



జనసేనలో చేరినవారితో భైరవప్రసాద్

కదిరి అర్బన్, మే 9: పట్టణంలోని 34వార్డుకు చెందిన దాదాపు 50మంది యువకులు జనసేనలోకి చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాయంలో గురువారం వారు నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్ సమక్షంలో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో తిరుపాల్, గోపీ, భరత్, భార్గవ్, నందకిషోర్, మునికుమార్, అరుణ్, గణేష్, తరుణ్, సందీప్, నరసింహులు తదితరులు ఉన్నారు.

వైసీపీతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు



కమలం గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థిస్తున్న చిలకం మధు

ధర్మవరం, మే 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి రాష్ట్రంలో జగన్‌ను, ధర్మవరంలో కేతిరెడ్డిని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ట్టణంలోని శివానగర్‌లో గల శివాలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రను పట్టణంలోని 40వార్డులలో తమ పార్టీ నాయకులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...జగన్‌పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. ఎన్నికలకు ముందు జగన్ అనేక హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చాక ఏవీ నెరవేర్చకుండా అన్ని వర్గాల వారిని మోసం చేశారని అన్నారు. ఇది ఇలా ఉండగా ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు అధికంగా చేశారన్నారు. ధర్మవరం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరిశ్యాంకుమార్, రాజారెడ్డి, వెంకటరెడ్డి, నాయుడూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీలో మాజీ వలంటీర్లు



ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న మాజీ వలంటీర్లు

కొత్తచెరువు, మే 9: ఈనెల 13వ తేదీన ఎన్నికలు జరుగుతున్నందున ప్రజాప్రతినిధులు వలంటీర్లను బలవంతంగా రాజీనామాలు చేయించారు. వారిని ఎన్నికల విధులకు విరివిగా వాడుకుంటూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా వారు విధులు నిర్వహించిన సమయంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్యపాత్ర పోషించారు. వారితో ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు రాజకీయ ప్రచారాలను చేయిస్తూ.. వచ్చేది మన ప్రభుత్వమే తప్పకుండా ఫ్యాన్‌కు ఓటు వేయాలంటూ ఓటర్లను ప్రలోబాలకు గురిచేయిస్తున్నారు. అంతేకాకుండా ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలు మాత్రమే పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కొత్తచెరువు మండల వ్యాప్తంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులతో పాట ఽప్రభుత్వం అందించిన సంక్షేమపథకాల జాబితాను అందజేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంతజరుగుతున్నా ఎన్నికల అధికారులు వారిపై చర్యలు చేపట్టకపోవడం ఏమిటని కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

తనకల్లు, మే 9: మండకేంద్రంలో వివిధ వార్డుల్లో గురువారం ఈవీఎం యంత్రాల ద్వారా ఓటు ఎలా వేయాలనేదానిపై టీడీపీ నాయకురాలు తోట సరోజమ్మ ఓటర్లకు అవగాహన కల్పించారు. నమూనా ఓటింగ్ ఈవీఎంలను తీసుకెళ్లి ఓటు ఎలా వేయాలో ప్రాక్టికల్‌గా తెలియజేశారు. నచ్చిన అభ్యర్థికి ఎలా ఓటు వేయాలి, ఓటు వేసిన తర్వాత కన్ఫర్మేషన్ ఎలా చేసుకోవాలి అనే దానిపై వివరించారు. ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గాండ్లపెంట: మండలంలోని గొడ్డివెలగల, కటారుపల్లి, సోమయాజుపల్లి, చామాలగొంది, తుమ్మలబైలు పెద్దతండా, గాండ్లపెంటలో టీడీపీ నాయకులు ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలనే దానిపై ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించారు నమూనా ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలో తెలియజేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలుతున్న మద్యం పట్టివేత

పుట్టపర్తి రూరల్/ కొత్తచెరువు, మే 9: మున్సిపాలిటీ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు పట్టుకున్నారు. సెబ్‌పోలీసులు బుధవారం రాత్రి చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఆటోలో తరలుతున్న 35కేసుల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు సెబ్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మద్యం రవాణా చేస్తున్న వ్యక్తులను విచారించగా కొత్తచెరువు మండలం తలమర్ల, బండ్లపల్లి, నారేపల్లికి చెందిన వైసీపీ నాయకులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. తనిఖీల్లో ఓ బొలేరో వాహనంలో కూడా భారీగా కర్ణాటక మద్యం పట్టుబడినట్లు సమాచారం. అక్రమ మద్యం రవాణాలో వైసీపీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి సెబ్ అధికారులకు ఫోన్ రావడంతో.. వారిని తప్పించి నంద్యాల, శ్రీకాకుళం, ఎనుమలపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులను ఇందులో బాధ్యులు చేసినట్లు కొంతమంది సెబ్ సిబ్బంది చర్చించుకోవడం బహిర్గతమైంది. దీంతో సెబ్ ఎస్ఐ పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులను గురువారం హుటాహుటిన కోర్టులో హాజరుపరచినట్లు కూడా తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే అధికార పార్టీకి కొంతమంది సెబ్‌సిబ్బంది వంతపాడుతున్నట్లు తెలుస్తోంది. సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బొలేరో వాహనంలో మద్యం దొరకలేదని, ఊరికే అనుమానంతో పట్టుకుని సెబ్ స్టేషన్‌లో ఉంచామని సెబ్ ఎస్ఐ చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

చంద్రబాబుతోనే ఉద్యోగాల కల్పన: కందికుంట



యువత సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకట ప్రసాద్

కదిరి అర్బన్, మే 9: చంద్రబాబుతోనే ఉద్యోగాలు వస్తాయని, ఆయన సీఎం అయితే పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఆకాష్ ఫంక్షన్‌హాల్లో గురువారం ఆయన మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకునే యువతతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభివృద్ధికి పాటుపడే నాయకుడిని గుర్తించి ఆలోచించి ఓటు వేయాలని తెలిపారు. మొదటిసారిగా వేసే ఓట్లు, దేశ, రాష్ట్ర గతిని మార్చేలా ఉండాలన్నారు. రాష్ట్రగతిని మార్చేనేత చంద్రబాబే అన్నారు. గతంలో ఎన్నో ఐటీ కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. అదే వైసీపీ అధికారంలోకి వచ్చాక కంపెనీలను తరిమేశారన్నారు. ఉద్యోగావకాశాలు కల్పించే చంద్రబాబునే సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాహుద్దీన్, నాగేంద్రప్రసాద్, రాజశేఖర్‌బాబు తెలుగుయువత నాయకులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే మహిళా సంక్షేమం:

చంద్రబాబుతోనే మహిళా సంక్షేమం సాధ్యమని కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని ఆకాష్ ఫంక్షన్‌హాల్లో మహిళ ఉన్నతి, ఔన్నత్యంకోసం బాబు మళ్లీ రావాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో కందికుంట పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారిత, స్త్రీ సంక్షేమం కోసం కృషి చేస్తోంది టీడీపీనే అన్నారు. ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పిస్తూ, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు మహిళల సమానత్వానికి నాంది పలికారని గుర్తు చేశారు. అలాగే ఎన్టీఆర్ మొదటిసారిగా మహిళలకు 33 అసెంబ్లీసీట్లు, ఐదు మంత్రి పదవులిచ్చి రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచారని, అలాగే చంద్రబాబు శాసనసభకు తొలి మహిళా స్పీకర్‌ను అందించారని తెలిపారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు మహిళా సాధికారత కోసం డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. చదువుకుంటున్న పేద బాలికలకు సైకిళ్లు పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళల కోసం ఇన్ని చేసిన చంద్రబాబును మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కూటమి మహిళా నేతలు ఫర్వీన్‌భాను, రమణమ్మ, రత్నమ్మ, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

పలువార్డుల్లో ఎన్నికల ప్రచారం

కదిరి: పట్టణంలోని 25, 29, 15వ వార్డులలో కందికుంట వెంకట ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించి చంద్రబాబు సీఎం కాగానే అమలు చేస్తారని చెప్పారు. ముఖ్యంగా ముస్లింల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. గతంలో ముస్లిం మైనార్టీల కోసం చంద్రబాబు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కూటమిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ 25 వ వార్డుఇన్‌చార్జి ఖాదర్‌బాషా, 29వ వార్డు ఇన్‌చార్జి డైమండ్ ఇర్షాన్, 15వార్డు ఇన్‌చార్జీ హైదర్ కార్యకర్తలు పాల్గొన్నారు.



25వ వార్డులో ప్రచారం..

టీడీపీలోకి పలువురి చేరిక

కదిరి: పట్టణంలోని హైపర్‌మార్టు పక్కన సోఫాల ఆర్ఫీతో పాటు పలువురు టీడీపీలోకి చేరారు. ప్రచారంలో ఉన్న కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసి ఆయన సమక్షంలో చేరారు. కందికుంట వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి విజయానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు.

సైకో పాలనకు చరమగీతం పాడుదాం: నారా రోహిత్



రోడ్‌షోలో పాల్గొన్న నారారోహిత్, మాజీమంత్రి పల్లె, సింధూర



బ్రాహ్మణపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పల్లె సింధూరా రెడ్డి

పుట్టపర్తి మే 9: రాష్ట్రంలో సైకో జగన్ పాలనకు చరమగీతం పాడాలని సినీ నటుడు నారారోహిత్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో గురువారం రాత్రి ఆయన మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ ఈఎం జగన్ ప్రజలకు ఇచ్చింది పావలా అయితే .. లాక్కుంది ముప్పావలా అని మండిపడ్డారు. ఈ ఐదేళ్లు రాష్ట్రంలో అరాచకపాలన సాగించారన్నారు. ఈ ఎన్నికల్లో జగన్ పాలనకు స్వస్తి పలికి కూటమిని గెలిపించాలని కోరారు. సైకిల్‌గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రోడ్ షో బ్రాహ్మణపల్లి నుంచి ప్రారంభమై బీడుపల్లి, ప్రశాంతిగ్రామ్, పెద్దకమ్మవారిపల్లి, పుట్టపర్తి ప్రధానరోడ్‌మీదుగా ఎనుమలపల్లి గణేష్‌కూడలి వరకు సాగింది. యువనేత పల్లె కిశోర్‌రెడ్డి, కూటమి నాయకులు పత్తి చంద్రశేఖర్, అబ్దుల్, రామలక్ష్మణ్‌లు, పీసీగంగన్న, బెస్తచలపతి తదితరులు పాల్గొన్నారు.

● పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో బ్రాహ్మణపల్లి తండా, బీడుపల్లి గ్రామాల్లో పల్లె సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అభివృద్ధిని కాంక్షించే చంద్రబాబును సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బెస్తచలపతి, రమేష్ నాయక్, రామలక్ష్మణ్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డికి మద్దతుగా జిల్లాకేంద్రంలో కూటమి శ్రేణులు పెద్దఎత్తున బైక్ ర్యాలీని నిర్వహించారు. మొదట స్థానిక సత్యమ్మ ఆలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తర్వాత ర్యాలీని ప్రారంభించారు. ప్రచార రథంలో అభ్యర్థి సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, పల్లె కిశోర్‌రెడ్డి, కూటమి నాయకులు పత్తి చంద్రశేఖర్, చెన్నకేశవులు,అబ్దుల్ కొండమరాజు ఉండి ముందు వెళుతుండగా.. వారివెనుక బైక్ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీ కర్ణాటకనాగేపల్లి, కోవెలగుట్టపల్లి, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, మామిళ్ళకుంటక్రాస్, కప్పలబండ గ్రామాల్లో సాగింది. పెద్దఎత్తున కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పల్లె కిశోర్ ప్రచారం..

పుట్టపర్తి రూరల్: మండలంలోని రాచువారిపల్లి, బుగ్గపల్లి, కప్పలబండ గ్రామాల్లో టీడీపీ యువ నాయకుడు పల్లె వెంకట కృష్ణకిశోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ సారి అయినా ఆలోచించి అభివృద్ధికి కృషి చేసే చంద్రబాబును సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కూటమి శ్రేణుల పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు..

ఓబుళదేవరచెరువు: మండలంలోని తిప్పేపల్లికి చెందిన 25కుటుంబాల వారు టీడీపీ లోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలకేంద్రంతో పాటు కొడపగానిపల్లి, ఇండ్లవెంకటాంపల్లి గ్రామాలకు చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. జిల్లాకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో వారు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పుట్టపర్తి: మున్సిపాలిటీలోని మూడోవార్డు వైసీపీ కౌన్సిలర్ సాయిలీల భర్తతో కలిసి టీడీపీలోకి చేరారు. గతంలో ఈమె టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లారు. ప్రస్తుతం సొంతగూటికి చేరారు. అలాగే కొత్తచెరువు మండలం కొడపగానిపల్లికి చెందిన నారాయణస్వామి, రమేష్, సత్తి, రవికుమార్‌తో పాటు 20కుటుంబాల వారు, ఇండ్ల వెంకటంపల్లికి చెందిన వలంటీర్లు సుష్మ, మంజునాథరెడ్డితో పాటు మరో 10కుటుంబాల వారు చేరారు. అలాగే ఓడీసీ సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ రఘునాథరెడ్డి, ఉపసర్పంచు వెంకటస్వామిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీపతితో పాటు 25కుటుంబాల వారు కూడా చేరారు. వారందరూ జిల్లాకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె సమక్షంలో చేరారు.

అవినీతి సొమ్ము కక్కిస్తా: సత్యకుమార్



చిగిచెర్లలో సత్యకుమార్ ప్రచారం

ధర్మవరం రూరల్, మే9: కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సంపాదించిన అవినీతి సొమ్మునంతా కక్కిస్తానని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని పోతుకుంట, బీసీ కాలనీ, బృందావనం కాలనీ, రాంపురం, కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, కుణుతూరు, గరుడంపల్లి, దిగ్గెంకొట్టాల, ఉప్పునేసినపల్లి, చిగిచెర్ల, చింతలపల్లి, వసంతపురం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులు, స్థానిక నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్‌షో చేస్తూ కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. ఏ గ్రామానికి వెళ్లినా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి కనీసం ప్రజలకు తాగునీరు కూడా అందించలేక పోయారన్నారు. అవినీతి అక్రమాల్లో బిజీగా ఉండి ప్రజల సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే విచారణ చేసి అవినీతి సొమ్మునంతా కక్కిస్తామన్నారు. అవినీతి చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమన్నారు. అదేవిధంగా ఇంటింటికీ తాగునీరు, చెరువులకు సాగునీరు అందిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ మాజీచైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీలు మద్దిలేటి, వేణుగోపాల్‌రెడ్డి, మహేష్‌చౌదరి, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పట్టు చీరకు జాతీయ స్థాయి గుర్తింపు తెస్తా..

ధర్మవరం: ధర్మవరంలో ఆత్మహత్యలు లేని చేనేత పరిశ్రమను తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో చేనేతల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి సత్యకుమమార్‌తో పాటు మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సత్యకుమార్ మాట్లాడుతూ... అధికారంలోకి రాగానే దేశంలోనే ధర్మవరం చేనేత రంగం రూపురేఖలను మార్చేస్తానన్నారు. చేనేత క్లస్టర్‌తోపాటు ముడిసరుకులను సబ్సిడీపై ఇప్పించే బాధ్యతను తీసుకుంటానని, నేతన్నల ఆత్మహత్యలను లేని చేనేత పరిశ్రమను చూడాలన్నదే తన లక్ష్యమని అన్నానరు. అదేవిదంగా ధర్మవరానికి టెక్స్‌టైల్స్ పార్క్ తీసుకొస్తానని, ధర్మవరం పట్టుకు జాతీయ స్థాయి గుర్తింపును తీసుకువస్తానని అన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ఎమ్మెల్యే కేతిరెడ్డి భూదందాలే కనిపిస్తున్నాయన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడడమే కాకుండా రౌడీ మూకలను ప్రోత్సహిస్తున్న కేతిరెడ్డిని రాజమండ్రి జైలుకు పంపుతామన్నారు. అనంతరం నిమ్మలకిష్టప్ప మాట్లాడుతూ సత్యకుమార్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. సమావేశంలో చేనేత నాయకులు పాల్గొన్నారు.

సత్యకుమార్‌ను గెలిపించుకుందాం..

ధర్మవరం: ఎస్సీవర్గీకరణ ఉద్యమానికి అండగా నిలిచిన సత్యకుమార్‌ను గెలిపించుకుందామని ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయి నాయకుడు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమానికి సత్యకుమార్ యాదవ్ కేంద్ర పెద్దలతో మాట్లాడి అండగా నిలుస్తున్నారని అన్నారు. అలాంటి సత్యకుమార్‌ను అందరం కలిసికట్టుగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సన్నద్ధం కండి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి, మే 9: సార్వత్రిక ఎన్నికల్లో ఈనెల 13న జరిగే పోలింగ్‌కు ముందస్తు ఏర్పాట్లను చేసుకుని సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం ఆయన వీడియోకాన్ఫరెన్సు ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్‌కు 72 గంటల ముందే చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు పోలింగ్ ఏర్పాట్లను వివరించారు. ఎస్పీ మాధవరెడ్డి జిల్లాలో భద్రతా ఏర్పాట్లు, సరిహద్దుల్లో నిఘా, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి పాల్గొన్నారు.

23,514 మంది పోస్టల్‌బ్యాలెట్ వినియోగం

పుట్టపర్తి మే 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఇతరులు 23,514 మంది పోస్టల్‌బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నారు. ఆఖరి రోజు గురువారం పోస్టల్‌బ్యాలెట్ ద్వారా 536 మంది ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఓటు వేశారు. ఒక ఎంపీ, ఆరు ఎమ్మెల్యే స్థానాలకు గత ఐదు రోజులుగా సాగిన పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్‌లో 23,514 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులతో పాటు అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులు ఉన్నారు. ఇక వికలాంగులు, వృద్ధులు, ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలీసుల కవాతు

ధర్మవరం, మే 9: రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ సిబ్బంది పట్టణంలో గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు. స్థానిక కాలేజీ సర్కిల్ నుంచి కళాజ్యోతి,ఎన్టీఆర్, అంజుమన్ సర్కిళ్లు, తేరు బజారు, దిమ్మెల్‌సెంటర్, కదిరిగేటు మీదుగా కవాతు సాగింది. ఎన్నికలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా, ప్రజలలో ధైర్యం నింపడానికి కవాతు చేపట్టినట్టు సీఐ తెలిపారు. ఈనెల 13న జరిగే ఎన్నికలలో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు..

వైసీపీ సేవలో బీఎల్‌ఓలు

● ఓటరు స్లిప్పులను వలంటీర్లకు అందజేస్తున్న వైనం

బత్తలపల్లి, మే9: ఓటరు స్లిప్పులను ఇంటింటికీ తిరిగి ఇవ్వాల్సిన బీఎల్‌ఓ (బూత్ లెవల్ అధికారు)లు వైసీపీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తున్నారు. మండలంలో పలువురు బీఎల్‌ఓలు.. వైసీపీ నాయకుల సూచన మేరకు వలంటీర్ల ఇళ్ల వద్దకెళ్లి, వారి పరిధిలోని ఓటర్లకు స్లిప్పులు, ఓటుకు రూ.2 వేలు డబ్బు అందజేస్తున్నట్లు సమాచారం. ఓటరు స్లిప్పులు, డబ్బును వలంటీర్లు ఓటర్ల ఇళ్లవద్ద అందజేసి, వైసీపీకి ఓటు వేయాలనీ, లేకుంటే రేషన్ కార్డు తొలగిస్తారనీ, ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయంటూ బెదిరింపులకు దిగుతున్నారు. వైసీపీ నాయకులతో ఫోన్‌లో వలంటీర్లు మాట్లాడిస్తున్నట్లు సమాచారం.బత్తలపల్లిలో ఇద్దరు, మండలంలోని ముష్టూరు సచివాలయం పరిధిలో ఓ బీఎల్‌ఓ.. వలంటీర్లకు ఓటరు స్లిప్పులను అందజేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ఓటు ఎంతో విలువైనది: ఎస్పీ



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓటు వేస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మే 9: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కు ప్రతిపౌరుడికి ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్‌బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో గురువారం ఆయన తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది తమ ఓటుహక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని తెలిపారు.

గుండెపోటుతో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మృతి



గవ్వల బాబు(ఫైల్)

ధర్మవరం, మే 9: పట్టణంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గవ్వలబాబు(41) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఈయన టీడీపీ హయాంలో రెండున్నర సంవత్సరాలు మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా కొనసాగారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ఆయన ఇంటికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా పట్టణ ప్రముఖులు కూడా గవ్వల బాబు మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య నేత్రావతి, కుమారుడు చందన్‌బాబు, కుమార్తె నమిత ఉన్నారు.

'వైసీపీ అరాచకాలను చూడలేకే పార్టీ మారా'

కదిరి, మే 9: వైసీపీలో పలువురు నాయకులు చేస్తున్న అరాచకాలను చూడలేకనే ఆ పార్టీని వీడి టీడీపీలో చేరామని మాజీ ఎంపీపీ ఆవుల మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. తలుపుల మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానికంగా ఉన్న వైసీపీ నాయకుల అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వాటిని ఎదుర్కోవడానికే ఆ పార్టీని వీడి టీడీపీలో చేరామన్నారు. ఒక నాయకుడు చెంబులతో మోసం చేస్తే, మరో నాయకుడు వడ్డీవ్యాపారం చేస్తూ పేదల రక్తం తాగుతున్నారని తెలిపారు. దౌర్జన్యాలను ప్రశ్నించిన సొంత పార్టీ నాయకులపైనే వీరు దాడులు చేస్తున్నారన్నారు. ఈ అరాచకాలకు అడ్డుకట్టవేయడానికే తాము టీడీపీలో చేరామన్నారు. కూటమిని గెలిపించడానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ అరచకాలకు అడ్డుకట్ట వేసీ తీరుతామని తెలిపారు.

వైసీపీ సభలో ఇరు వర్గాల తోపులాట

కదిరి, మే 9: తలుపులలో గురువారం వైసీపీ నాయకులు రోడ్‌షో నిర్వహించారు. ఈరోడ్‌షో ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. అక్కడున్న ప్రచార రథం ఎక్కే సమయంలో పూల శ్రీనివాసరెడ్డి వర్గం, క్రిష్టారెడ్డి(డిక్కుబాబు) వర్గం మధ్య మొదట వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. తమ అనుచరుడు ప్రచారం ఎక్కాలని ఒకరు, తమవారే ఎక్కాలని మరొకరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇది కాస్త ఇరువురి వర్గాల మధ్యతోపులాటకు దారితీసినట్లు సమాచారం. రోడ్డుషో సంగతి ఏమోకానీ, అక్కడికి వచ్చిన ప్రజలు వీరి తోపులాటను చూసి ఆందోళనలకు గురైనట్లు తెలిసింది. వీరిద్దరి మధ్య ఉన్న అంతర్గత కలహాలు బయటపడ్డాయని ప్రజలు చర్చించుకున్నారు.

ఎన్నికల నిబంధనలు తుంగలోకి..

● ఎన్నికల ప్రచారంలో ప్రధాన రోడ్డుపై అడ్డగోలుగా వాహనాలు నిలిపిన వైసీపీ శ్రేణులు

● ఇబ్బంది పడ్డ ఇతర వాహనదారులు, ప్రయాణికులు

కొత్తచెరువు, మే9: ఎన్నికల నిబంధనల మేరకు ప్రచారాల్లో ప్రధాన రహదారు లను బ్లాక్ చేయరాదని ఈసీ స్పష్టంగా ఆదేశాలిచ్చింది. అయితే వాటిని అధికార పార్టీ నాయకులు బేఖాతరు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలకేంద్రంలోని పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారిపై గురువారం వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయితే పార్టీ శ్రేణులు ప్రచార రథం, ఇతర వాహనాలను అడ్డుగోలుగా పెట్టి రోడ్డును బ్లాక్ చేశారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



పుట్టపర్తి మెయిన్ రోడ్డులో ముందుకు పోలేని స్థితిలో వాహనాలు

నేడు నారా రోహిత్ రోడ్‌షో

ధర్మవరం, మే9: ధర్మవరం పట్టణంలో కూటమి అభ్యర్థి సత్యకుమార్‌కు మద్దతుగా సినీ నటుడు నారారోహిత్ శుక్రవారం సాయంత్రం 4గంటలకు రోడ్‌షో నిర్వహించనున్నట్లు కూటమి నాయకులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10వ, 11వ ,12వ వార్డులలో సత్యకుమార్ ఎన్నికల ప్రచారం ఉంటుందన్నారు. ఆ తరువాత సాయంత్రం సత్యకుమార్ నారారోహిత్‌తో కలిసి మారుతీరాఘవేంద్ర స్వామి ఆలయం నుంచి రోడ్‌షో ప్రారంభిస్తారన్నారు. గాంధీనగర్, ఎన్టీఆర్, అంజుమన్,కళాజ్యోతి సర్కిళ్ల మీదుగా కాలేజ్ సర్కిల్ వరకు రోడ్‌షో సాగుతుందన్నారు.

రేపటి నుంచి 13 వరకు మద్యం దుకాణాలు బంద్ : తహసీల్దార్

హిందూపురం అర్బన్, మే 9: సార్వత్రిక ఎన్నికల్లో దృష్ట్యా శనివారం నుంచి 13వ తేదీ వరకు మద్యం దుకాణాలు బంద్ చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో శనివారం సాయంత్రం 7 గంటల నుంచి సోమవారం సాయంత్రం 7 గంటల వరకు మద్యం షాపులు, రెస్టారెంట్‌లు, కల్లుదుకానాలు బంద్ చేయనున్నారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా కూడా మద్యం దుకానాలు బంద్ చేయనున్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి: డీఎంహెచ్‌ఓ



రికార్డులను పరిశీలిసున్న డీఎంహెచ్‌ఓ

మడకశిర రూరల్, మే 9 : ఎన్నిల పోలింగ్ కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. డీఎంహెచ్‌ఓ గురువారం మండలంలోని కల్లుమర్రి ప్రాధమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎండలు అధికంగా ఉన్నందున వడదెబ్బ సోకకుండా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ వెంట డాక్టర్ వినోద్‌కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

మడకశిర రూరల్, మే 9: స్థానిక మడకశిర-పెనుకొండ ప్రధాన రహదారిలో ఆర్ అనంతపురం వద్ద గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో జింక మృతి చెందింది. అర్ అనంతపుం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి జింక రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఫారెస్టు అధికారి శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జింక కళేబరాన్ని స్థానిక అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్, మే 9 : మండలంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో పరమేశ్వరపురం వద్ద 44వ జాతీయరహదారిపై గురువారం టాటాఏస్ వాహనం, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. పరమేశ్వరపురానికి చెందిన శ్రీరాములు, నరేష్ ఇరువురు కలిసి ద్విచక్రవాహనంలో పని నిమిత్తం సోమందేపల్లికి వెళ్లారు. వారు జాతీయరహదారిపైకి రాగానే కర్ణాటక నుంచి వస్తున్న కూల్‌డ్రింక్ బాటిళ్ల తరలించే టాటాఏస్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహన దారులు శ్రీరాములు, నరేష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన 108సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోరంట్ల, మే 9: మండలంలోని కొండాపురం-బూదిలి రహదారిలో ఆటో బోల్తాపడి తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ముబారక్ బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సోమందేపల్లి మండలం ఓబుళదేవరపల్లికి చెందిన ముబాకర్ (19) కొంతకాలంగా గోరంట్ల మండలంలోని బూదిలిలో నివసముంటూ ఆటో నడిపి జీవన సాగించేవాడు. కర్ణాటకలోని బాగేపల్లికి వెళ్లి ఆటోలో ప్రయాణీకులను బూదిలికి తీసుకొస్తుండగా, అక్కమ్మ గారి దేవాలయం సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలోని ఇద్దరు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆటో డ్రైవర్ తలకు బలమైన గాయం కాగా, గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం హిందూపురం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరు విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రూ.38 లక్షల నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

మడకశిర టౌన్, మే 9: అమరాపురం మండలం మద్దనకుంట చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండ తరలిస్తున్న రూ. 38లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా మరిదాసనహళ్లికి చెందిన మంజునాథ్ స్విఫ్ట్ కారులో తుమకూరు నుంచి ఆంధ్రప్రదేశ్ అమరాపురం మండలం మద్దనకుంట మీదుగా మరిదాసనహళ్లికి వెళ్లుతున్న సమయంలో అతని వద్ద 38లక్షల రూపాయల నగదు ఉన్నట్లు గుర్తించామని, నగదుకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకెళ్లుతుండగా నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మంజునాథ్ తన పండించిన వక్క పంటను తుమకూరు మార్కెట్‌లో అమ్మి నగదు తీసుకొస్తున్నట్లు సమాచారం.

కర్ణాటక మద్యం స్వాధీనం

లేపాక్షి, మే 9: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని లేపాక్షి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. కంచిసముద్రం బార్డర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఎస్‌ఐ గోపి వాహనాలు తనిఖీ చేస్తుండగా కల్లూరుకు చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంలో 802 టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిని అరెస్ట్ చేసి మద్యం, ద్విచక్రవాహనాన్ని స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎఫ్‌ఎస్‌టీ టీమ్ కుర్లపల్లి వద్ద దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. 226టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి రిమాండుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ మళ్లీ వస్తే ఆస్తులు వదులుకోవాల్సిందే..

● ఎన్నికల ప్రచారంలో నందమూరి బాలకృష్ణ



ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థిని భార్గవిని సన్మానిస్తున్న బాలకృష్ణ, పార్థసారథి



బేవనహళ్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బాలకృష్ణ

హిందూపురం, మే 9: వైసీపీ మరోసారి అధికారంలోకి వచ్చిందంటే ఆస్తులు వదులుకోవాల్సిందేనని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ అన్నారు. గురువారం హిందూపురం మండలంలోని బేవనహళ్లిలో, పట్టణ పరిధిలోని కొన్ని వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో వైసీపీ నాయకులు హిందూపురం నియోజకవర్గంలో మాన్యం భూములను కబ్జాచేశారని, ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపించినా అమ్మేశారన్నారు. మరోసారి వైసీపీ వస్తే మనందరి ఆస్తులు వదులుకుని ఊళ్లు విడచాల్సిందేనన్నారు. నవ్యాంధ్ర నిర్మాత విజనరీ ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు, వైసీపీ ప్రభుత్వాన్ని తరిమేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గ అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుబలకు పెద్దపీట...

తెలుగుదేశం పార్టీ హయాంలో కురుబలకు పెద్దపీట వేశామని బాలకృష్ణ అన్నారు. స్థానిక జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం వేలాదిగా తరలివచ్చిన కురుబల ఆత్మీయ సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ... కురుబలు టీడీపీ వెన్నంటే ఉన్నారని, అందుకే వారికి పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన భార్గవి అనే విద్యార్థిని బాలకృష్ణ, బీకే పార్థసారథి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి : వసుంధరాదేవి

చిలమత్తూరు: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని నంద మూరి వసుంధరా దేవి పేర్కొన్నారు. ఆమె గురువారం చిలమత్తూరు మండలంలోని కోడూరు, కోట్లోపల్లి, చిన్నప్పరెడ్డి పల్లి, మధురేపల్లి, కందూరుపర్తి, మరసనపల్లిల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె వెంట హిందూపురం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్విని, బేకరీ గంగాధర్, శ్రీదేవి, మీసేవా సూరి, వెంకటేశులు తదితరులు ఉన్నారు.



కోడూరులో వసుంధరాదేవి ఎన్నికల ప్రచారం

నియంత పాలనకు ఇక మూడు రోజులే..

టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సవిత, బీకే



గోరంట్ల రోడ్‌షోలో పాల్గొన్న సవిత, బీకే, జీఎం శేఖర్

గోరంట్ల, మే 9: ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి నియంత పాలన ఇక మూడురోజుల్లో అంతం కాబోతోందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. గోరంట్ల పట్టణంలో గురు వారం నిర్వహించిన రోడ్‌షోలో వారితోపాటు మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు పట్టుకుని, ద్విచక్రవాహనాల్లో హోరెత్తించారు. కదిరి రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద నుంచి ప్రధాన రహదారిపై రోడ్‌షో నిర్వహించగా గజ మాలలు వేయడానికి కూటమి నాయకులు పోటీపడ్డారు. గుమ్మయ్యగారిపల్లి వరకు రోడ్ షో సాగింది. ప్రధాన కూడలిలో సవిత మాట్లడుతూ... వైసీపీ పాలనలో భూకబ్జాలు, దందాలు, బెదిరింపులు, దోచుకోవడం తప్ప అభివృద్ధి లేదని, అలాంటి వారికి ప్రజలను ఓటు అడిగే హక్కులేదన్నారు. జగన్ దోచుకున్నది చాలక ప్రత్యేకంగా భూచట్టాన్ని తెచ్చారన్నా రు. క్రమక్రమంగా ప్రజల భూములు లాక్కోవడానికి ఇదొక ఎత్తుగడ అని మండిపడ్డారు. పదేళ్ల రాజకీయ చరిత్ర కలిగిన వైసీపీకి పార్లమెంటు పరిధిలో పోటీ చేయడానికి స్థానిక అభ్యర్థులు లేకపోవడం వారి దౌర్భాగ్యన్నారు. గోరంట్లకు తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, శ్మశానం ఏర్పాటు చేస్తామని, చెరువులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అందు బాటులో ఉండే తనను పార్థసారథిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీకే మాట్లాడుతూ... వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలతో రాష్ట్రంలో అన్ని వర్గాలను సర్వనాశం చేశారని, వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ముఖ్యమంత్రి పెద్ద కొండలను మింగుతుంటే, ఎమ్మెల్యేలు చిన్నకొండలను స్వాహా చేస్తున్నారన్నారు. తాను ఇసుక దోచుకున్నానని అవినీతి సొమ్ముతో వెలసిన జగన్ సొంత పత్రికలో లేనిపోని ఆ రోపణలు చేశారని బీకే మండిపడ్డారు. తన జీవితం తెర చిన పుస్తకం అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 450 అంగన్‌వాడీ ఉద్యోగాలకు పైసా ఆశించలేదని, ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఒక పోస్టుకు రూ.9లక్షల వంతున తీసుకున్నది వాస్తవం కాదా అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నరకాసుర పాలన ఐదేళ్లుగా సాగిందని 80శాతం కేంద్ర నిధులతో రాష్ట్రాన్ని నడిపారన్నారు.

మీ భవిష్యత్తు బాధ్యత మీదే

మీ ప్రాంతం, రాష్ట్రం బాగుపడాలన్నా... మీరు, మీ పిల్లల భవిష్యత్తు క్షేమంగా ఉండాలన్నా ఆలోచించి ఎన్నికల్లో నిర్ణయించుకోవాలని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత పేర్కొన్నారు. మళ్లీ పొరపాటు చేస్తే మీ భవిష్యత్తుకు మీరే బాధ్యులవుతారని హెచ్చరించారు. ఆమె గురువారం మండలంలోని నారసింహపల్లి పంచాయతీలోని బూడిదగడ్డపల్లి, చింతలపల్లి, ఎర్రపల్లి, నారసింహపల్లిల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఆమెకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. మల్లాపల్లికి చెందిన వసంతరావు, వెంకమ్మ, నాగరాజురావు, అన్నపూ ర్ణమ్మ, గాయత్రి, లక్ష్మమ్మ, నరసింహ, కొత్తపల్లి గొల్లనాగరాజు వైసీపీనుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కన్వీనర్ సోముశేఖర్, రాజారెడ్డి, నందమోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి, మహమ్మద్, సుధాకర్‌రెడ్డి, నరేష్‌యాదవ్, లక్ష్మీపతి తదితరలు, జనసేన, బీజేపీ నాయకులున్నారు.

రొద్దం: మండంలోని శ్యాపురానికి చెందిన చెందిన వైసీపీ ఎంపీటీసీ గొల్ల రమేష్ 17 కుటుంబాలతో సవిత సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఎం కొత్తపల్లికి చెందిన ఏడు కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాధవనాయుడు, కంబాలపల్లి సర్పంచ్ మంజు, పోత న్న, మాజీ ఎంపీటీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నారసింహపల్లి ప్రచారంలో సవిత

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్న ఉషశ్రీ

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), : ప్రశాంతంగా ఉన్న పెనుకొండ నియోజకవర్గంలో లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తోందని కూటమి ఎమ్మెల్యేఅ భ్యర్థి సవిత విమర్శించారు. ఆమె గురువారం సోమందేపల్లిలో కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథితోఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోలింగ్ సమయంలో ఎలా ఓటు వేయాలనేదానిపై ఈవీఎం నమూనాలతో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరూ మెచ్చుకునేలా చంద్రబాబు మేనిఫేస్టో రూపొందించారన్నారు. ఇప్పటికే సైకిల్ స్పీడ్ పెంచడంతో ముఖ్యమంత్రి జగన్ లండన్‌కు పారిపోయేందుకు సిద్ధమయ్యాడన్నారు. ఇదిలా ఉంటే కొన్నేళ్లుగా ఫ్యాక్షనిజాన్ని పెనుకొండలో నిర్మూలించామని, ఇప్పుడు ఉషశ్రీ నాయకులతో నరుకుతాం, తలలు తీయిస్తాం అంటూ మాట్లాడిస్తున్నారన్నారు. నీవు భయపెడితే ఇక్కడి ప్రజలు భయపడేవారు కాదన్నారు. బీకే మాట్లాడుతూ... రాష్ట్రానికి ఈ ఐదేళ్లు పట్టిన దరిద్రం మరో నాలుగు రోజుల్లో పోతుందన్నారు. సోమందేపల్లి మండలంలో చేనేత పరిశ్రమపై ఆధారపడి చాలా మంది ఉన్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తెస్తామన్నారు. స్థానికేతరులను నమ్మితే దోచుకుని వెళ్తారని అందుకు నిదర్శనం ఎమ్మెల్యే శంకర్‌నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో కత్తి మారుతి, నీరుగంటి చంద్ర, జక్కాచంద్ర, కిష్ట, తదితరులు పాల్గొన్నారు.



రొద్దంలో వైసీపీ ఎంపీటీసీని టీడీపీలోకి ఆహ్వానిస్తూ...

వైసీపీ నాయకుల బాహాబాహి

ఓటరు స్లిపుల పంపిణీలో వివాదం - నడిరోడ్డుపై కొట్టుకున్న వైనం



రామకృష్ణపై దాడిచేస్తున్న శశిభూషణ్, శశిభూషణ్‌ను తీసుకెళ్తున్న వైసీపీ నాయకులు

గోరంట్ల, మే 9: వైసీపీ నాయకులు నడిరోడ్డుపై కొట్టుకున్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ వ్యవహారంలో వివాదం తలెత్తి, స్థానిక పాత స్టేట్‌బ్యాంకు వీధిలో గురువారం వైసీపీ నాయకుడు శశిభూషణ్, వార్డు సభ్యురాలు సరస్వతి భర్త వడ్డె రామకృష్ణ దాడి చేసుకున్నారు. మండలకేంద్రంలో వలంటీర్‌గా పనిచేస్తూ శశిభూషణ్ ఇటీవల రాజీనామా చేశాడు. గత పంచాయతీ ఎన్నికల్లో వినాయక్‌నగర్ వార్డు సభ్యుడిగా తనను కాదని రామకృష్ణ కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించడంతో వారి మ ధ్య అభిప్రాయ బేధాలున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికెళ్లి రామకృష్ణ ఇంటికి వస్తుండగా.. పాత స్టేట్‌బ్యాంకు వీధిలో శశిభూషణ్ తారసపడ్డాడు. తమ ప్రాంతంలోని వారికి ఓటరు స్లిప్పులు ఎందుకు ఇవ్వలేదని రామకృష్ణతో శశిభూషణ్ గొడవకు దిగాడు. పక్కనున్న వైసీపీ నాయకులు సర్ది చెబుతుండగా ఉన్నఫలంగా రామకృష్ణను కిందపడేసి, శశిభూషణ్ దాడి చేశాడు. పిడిగుద్దులు గుద్దాడు. అక్కడున్న వైసీపీ నాయకులు శశిభూషణ్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారు. దాడిపై బాధితుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిన జగన్

బంజారా నాయకుడు కేశవనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కేశవనాయక్

పెనుకొండ రూరల్, మే 9: అభివృద్ధిలో అత్యంత వెనుకబడిన హరిజన, గిరిజనులకు వైసీపీ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్ తీవ్ర అన్యాయం చేశారని టీడీపీ సీనియర్ నాయకుడు, సేవాఘడ్ బంజారా నాయకుడు కేశవనాయక్ విమర్శిం చారు. రాజ్యాంగబద్ధంగా అందాల్సిన పథకాల నిధులను దారి మళ్లించారని మండిపడ్డారు. చంద్రబాబుతోనే గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన గురువారం నియోజకవర్గంలోని గిరిజనులతో కలిసి గిరిజన తండాల్లో పర్యటించారు. అనంతరం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత భర్త వెంకటేశ్వరరావు, స్థానిక గిరిజనులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం ఎస్సీలకు, ఎస్టీలకు 27పథకాలు అమలు చేయాల్సి ఉందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజనులకు ఏ ఒక్క పథకం అందలే దన్నారు. ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 380కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరన్నారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే జాతి అంతరించిపోతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేఅభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి పార్థసారథిని అఖండ మెజార్టీతో గెలిపించాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ, పోలీస్ నారాయణనాయక్, నాయకులు అంజేనాయక్, రవినాయక్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు రాజగోపాల్‌నాయక్, నాగరాజునాయక్, సేవానాయక్, లక్ష్మనాయక్, రామాంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఫ్యాన్ రెక్కలను ఓటుతో విరగ్గొట్టండి

నారా రోహిత్ పిలుపు

ఎంఎస్ రాజుకు మద్దతుగా ప్రచారం



రొళ్ల రోడ్‌షోలో నారా రోహిత్, ఎంఎస్ రాజు

గుడిబండ, మే 9: రాష్ట్రంలో ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ రెక్కలను ఓటుతో విరగ్గొట్టాలని సినీనటుడు నారారోహిత్ పేర్కొన్నారు. ఆయన గురువారం గుడిబండలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారారోహిత్ మాట్లాడుతూ నారాచంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. 2014 ఎన్నికల్లో గెలిచి అనంతపురం జిల్లాలో దేశంలో ఎక్కడాలేనివిధంగా కియా పరిశ్రమ తీసుకొచ్చి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఒక్క చాన్స్‌తో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేసిందని 50ఏళ్ల వెనకబడిపోయిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి ఎంఎస్ రాజు, పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతంలో అరాచక పాలన సాగించారని, టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు మడకశిర నియోజకవర్గం అభివృద్ధి పనులు చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, దుర్గేష్, మంజునాథ్, నాగేపల్లిసురేష్, షబ్బీర్, లక్ష్మీనరసప్ప లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: ఎంఎస్ రాజుకు మద్దతుగా సినీనటుడు నారా రోహిత్ గురువారం రొళ్లలో రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు. టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్‌రాజు, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ కృష్ణా జలాలను తీసుకొచ్చి ఈ ప్రాంతం చెరువులకు హంద్రీ నీవాద్వారా నీటితో నింపి సస్యశ్యామలం చేస్తామన్నారు. అనంతరం ఎంఎస్ రాజు మాట్లాడుతూ వెనుకబడిన మడకశిర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ప్రత్యేక నిధులు తెచ్చి ఈ ప్రాంతంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తా మన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, నాయకులు పాండురంగప్ప, గురుమూర్తి, దాసిరెడ్డి, సిద్ధగంగప్ప, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అగళి: టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు భార్య ఉమాదేవి పేర్కొ న్నారు. ఆమె గురువారం మండలంలోని హళ్లికెర, పూలపల్లి, కోడిపల్లి, మధూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ ఉమేష్, బీసీసెల్ తాలూకా అధ్యక్షుడు తిప్పేస్వామి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ తిప్పేస్వామి, బోయనాగరాజు, మండల క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, కన్వీనర్ కుమారస్వామి, మహిళలు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గుడిబండలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

పరిపూర్ణానందస్వామికి సహకరిస్తే చర్యలు

● బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు : జీఎం శేఖర్

హిందూపురం, మే 9 : స్థానిక అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న పరిపూర్ణానందస్వామికి బీజేపీ నాయకులు ఎవరైనా సహకరిస్తే వారిపై చర్యలు ఉంటాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. ఆయన గురువారం పెనుకొండలో విలేకరులతో మాట్లాడుతూ... హిందూపురంలో ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్న నందమూరి బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పరిపూర్ణానందస్వామికి కొంతమంది బీజేపీ నాయకులు సహకరిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా... అలా ఎవరైనా మా పార్టీవారు సహకరిస్తుంటే పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పరిపూర్ణానంద స్వామి బీజేపీకి రాజీనామా చేశారన్నారు. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా ఉండటం ఆయన సొంత నిర్ణయమని కానీ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలన్నారు. అధికార పార్టీ నాయకులు బీజేపీపై లేనిపోని అభాండాలు వేస్తున్నారన్నారు. మైనార్టీలకు బీజేపీ పెద్దపీట వేసిందన్నారు. దేశంలో 14రాష్ట్రాల్లో బీజేపీ పాలన ఉందన్నారు. ఎక్కడగాని మైనార్టీలపైదాడులు చేసిన సంఘటనలు లేవన్నారు. ఓట్లకోసమే వైసీపీ మైనార్టీలను వాడుకుంటోందని విమర్శించారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

చిలమత్తూరు, మే 9: టీడీపీతోనే ముస్లిం మైనార్టీలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం టీడీపీ మాజీ కన్వీనర్ నందీషప్ప ఆధ్వర్యంలో మైనార్టీల ఇళ్ల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు.

రొద్దం: మండలకేంద్రంలో గురువారం మాజీ సర్పంచ్ నేత్రావతి ఆధ్వర్యంలో మహిళలు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి ఓటేసి గెలిపించాలని కోరారు.

నేడు అమరాపురంలో టీడీపీ ప్రచారం

మడకశిర టౌన్, మే 9: అమరాపురం మండల పరిధిలోని హలుకూరు, అమరాపురం మండలం కేంద్రం, తమ్మడేపల్లి, వలస, అగ్రహారం, మద్దనకుంట తదితర గ్రామ పంచాయతీల పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి తెలిపారు.

వైసీపీకి రాజీనామా

హిందూపురం, మే 9: ఇటీవల హిందూపురంలో వైసీపీ నాయకులు దాడిలో తీవ్రంగా గాయపడిన వైసీపీ నాయకుడు కార్తీక్ ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన 2021లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 25వ వార్డు నుంచి వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓడిపోయారు. అయితే వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కార్తీక్ మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్‌కు అనుచరుడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్బాల్ వైసీపీకి రాజీనామా చేసిన రోజున కార్తీక్ హిందూపురంలో టపాసులు పేల్చాడు. ఇది జీర్ణించుకోలేని వైసీపీ యువజన జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌తో పాటు ఆయన అనుచరులు కార్తీక్‌పై దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన కార్తీక్ కొద్దిరోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అదే పార్టీలో ఉన్న తనపై ఆ పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు అనుచరులతో కలిసి దాడిచేస్తే ఆ పార్టీ నాయకులు ఎవరూ స్పందించకపోవడం పట్ల మనస్తాపానికి గురై పార్టీకి రాజీనామా చేశారు. ఆర్యవైశ్యులకు అధికార పార్టీలో సముచిత స్థానం లేదని ఆపై ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేయడం సర్వసాధారణమైందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీలో ఉండటం మంచిదికాదని రాజీనామా చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నాడు.

'బాబుతోనే నాయీబ్రాహ్మణుల సంక్షేమం'

హిందూపురం, మే 9: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం సాధ్యమని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగరాజు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25వేలు గౌరవవేతనం, సెలూన్లకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కార్పొరేషన్ ద్వారా గ్రూపులకు రుణాలు మంజూరు చేస్తామని టీడీపీ ప్రకటించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలో నాయీబ్రాహ్మణులకు ప్రత్యేకస్థానం కల్పించారన్నారు. నాయీ బ్రాహ్మణులం దరూ టీడీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వైసీపీ

- కాంగ్రెస్ నాయకులు

పెనుకొండ రూరల్, మే 9: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలను నిండా మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నరసిం హులు పేర్కొన్నారు. వారు గురువారం పట్టణంలోని తోటగేరి, కృష్ణదేవరాయ సర్కిల్, దర్గాసర్కిల్, అంబేడ్కర్ సర్కిల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రకాశ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, గంగాధర్, నిస్సార్ అహ్మద్, గోవిందప్ప, నరహరి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ దూరవిద్య ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 9: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ దూరవిద్య పరీక్షా ఫలితాలను గురువారం వీసీ హుస్సేన్‌రెడ్డి విడుదల చేశారు. ఫిబ్రవరిలో దూరవిద్య డిగ్రీ బీఏ, బీకామ్, బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థులకు నాల్గో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 150 మందికి గాను 98 మంది (65 శాతం) పాస్ అయ్యారన్నారు. ఫలితాలను ఎస్కేయూ, స్కూల్స్ 9, మనబడి వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రివాల్యుయేషన్ కోసం ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జీవీ రమణ, బాలసుబ్రహ్మణ్యం, సీఈ డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

బీటెక్, బీఫార్మసీ ఫలితాలు...

జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, బీఫార్మసీ నాల్గో సంవత్సరం పరీక్షా ఫలితాలు విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్, మేలో బీటెక్ నాల్గో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలకు మొత్తం 14,263 మంది విద్యార్థులు హాజరుకాగా 13,944 మంది (97.76 శాతం) పాస్ అయినట్లు తెలిపారు. అదే విధంగా బీఫార్మసీ నాల్గో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్, సప్లమెంటరీతో పాటు (ఆర్15) సప్లమెంటరీ పరీక్షలకు మొత్తం 2,492 మందికి గాను 1,958 మంది (78.57 శాతం) పాస్ అయ్యారన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం ఐదుగురు విద్యార్థులను డీబార్ చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ద్వితీయ, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో ఎస్‌ఎల్‌ఎన్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఎస్వీ కళాశాల, గుంతకల్లు భ్రమరాంబిక కళాశాలలో ఒకరు చొప్పున మొత్తం ఐదుగురు మాస్ మాస్‌కాపియింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు.